మా కలం.. మీ గళం..
RNI : APTEL/ 2017/74310
# మన గళం
దిన పత్రిక
పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | ఎడిటర్ : నంద కిషోర్ | సంపుటి : 08 | సంచిక : 82 | మంగళవారం | 02 - 09 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించాలి



3లో..

## ఎస్‌సీఓ సదస్సులో పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ

- యుక్రెయిన్ యుద్ధానికి త్వరగా ముగింపు పలకాలని స్పష్టీకరణ
- శాంతి స్థాపన యావత్ మానవాళి ఆకాంక్ష అని వ్యాఖ్య
- భారత్ ప్రయత్నాలను అభినందించిన రష్యా అధ్యక్షుడు పుతిన్



మన గళం డెస్క్ : ఉక్రెయిన్ సంక్షోభంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ తన వైఖరిని మరోసారి ప్రపంచ వేదికపై స్పష్టం చేశారు. యుద్ధానికి త్వరగా ముగింపు పలికి, శాంతిని పునరుద్ధరించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అన్నారు. చైనాలోని తియాంజిన్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా సోమవారం ఇరువురు నేతలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, "యుక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి ఇటీవల జరుగుతున్న ప్రయత్నాలను మేం స్వాగతిస్తున్నాం. ఇందులో భాగస్వాములైన అన్ని పక్షాలు నిర్మాణాత్మకంగా ముందుకు సాగుతాయని ఆశిస్తున్నాం. ఈ ఘర్షణను వీలైనంత త్వరగా ముగించి, ప్రాంతీయంగా శాంతి, స్థిరత్వాన్ని నెలకొల్పే మార్గాలను మనం కనుగొనాలి. ఇది యావత్ మానవాళి పిలుపు" అని 2 లో..



## ప్రజలను మోసం చేసేవాళ్లే గొప్ప లీడర్లు

- రాజకీయాలపై మరోసారి నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు

మన గళం, న్యూఢిల్లీ : కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మరోసారి రాజకీయాలపై తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలను మోసం చేసేవారినే గొప్ప నాయకులుగా 2 లో..




## రాజకీయ పార్టీలు, ఈసీ మధ్య విభేదాలు బాధాకరం : సుప్రీంకోర్టు

- బీహార్ ఓటర్ల జాబితా సవరణపై సుప్రీంకోర్టులో విచారణ
- నామినేషన్ల చివరి తేదీ వరకు సవరణలకు అవకాశం ఇస్తామన్న ఈసీ

మన గళం, న్యూఢిల్లీ : బీహార్ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల కోసం నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు అవకాశం ఉంటుందని ఎన్నికల సంఘం (ఈసీ) కోర్టుకు స్పష్టం చేసింది. దీంతో సెప్టెంబర్ 1తో ముగిసిన గడువుపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తేలిపోయింది. బీహార్‌లో 2 లో..

# అసెంబ్లీకి రండి తేల్చుకుందా



- రాజంపేట పర్యటనలో సీఎం చంద్రబాబు పెన్షన్ల పంపిణీ
- దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చల్లో పాల్గొనాలని వైసీపీకి సవాల్
- బాబాయ్ హత్య, కోడికత్తి డ్రామాలపై చర్చకు తాను సిద్ధమన్న సీఎం
- అప్పులతో సంక్షేమం చేస్తే చిప్పే మిగులుతుందని పాత ప్రభుత్వంపై విమర్శ

మన గళం, అమరావతి : ఎన్నికల ముందు 'సిద్ధం సిద్ధం' అని నినాదాలు చేసిన వారికి నేను సూటిగా సవాల్ విసురుతున్నాను. దమ్ముంటే అసెంబ్లీకి రండి.. ఎవరిది విధ్వంసమో, ఎవరిది అభివృద్ధో తేల్చుకుందాం" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వైసీపీకి బహిరంగ సవాల్ విసిరారు. రాజంపేట నియోజకవర్గంలోని బోయనపల్లిలో సోమవారం జరిగిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగిస్తూ, గత ఐదేళ్ల పాలనపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, వైసీపీ నేతలు సిద్ధమేనా అని ప్రశ్నించారు. ఈ సవాల్ ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రతి అంశంపైనా చర్చకు సిద్ధమని చంద్రబాబు స్పష్టం చేశారు. "బాబాయ్ హత్యపై చర్చిద్దాం రండి. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల గురించి మాట్లాడుకుందాం. దళిత డ్రైవర్‌ను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఘటనపై సమాధానం చెప్పాలి. కోడికత్తి డ్రామా, గులక రాయి డ్రామాలపై కూడా చర్చకు నేను సిద్ధం. వైసీపీ అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు నేను సిద్ధంగా ఉన్నాను, మరి చర్చించడానికి వైసీపీ సిద్ధమా?" అంటూ చంద్రబాబు తీవ్ర స్వరంతో నిలదీశారు. తనపై క్లైమోర్ మైన్లతో దాడి చేసినా చలించలేదని, తాను డ్రామాలు ఆడే వ్యక్తిని కాదని ఆయన అన్నారు. అంతకుముందు, ముఖ్యమంత్రి నేరుగా బోయనపల్లి గ్రామంలోని యడవల్లి సుమిత్రమ్మ ఇంటికి వెళ్లి ఆమెకు పెన్షన్



అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెన్షన్ అనేది పేదలకు ఇచ్చే దానం కాదని, అది ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. "తెలుగు వారికి పెన్షన్లను పరిచయం చేసింది ఎన్టీఆర్. ఆయన రూ. 30తో ప్రారంభిస్తే, మేం ఇప్పుడు రూ. 4000 2 లో..

## ఏపీలో మూడు రోజులపాటు భారీ వర్షాలు




- వాయవ్య బంగాళాఖాతం మీదుగా ఉపరితల ఆవర్తనం

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాయవ్య బంగాళాఖాతం మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమ బెంగాల్-ఒడిశా తీరాలకు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతం మీదుగా 1.5-1.8 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రేపు (సెప్టెంబర్ 2) బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ఫలితంగా తూర్పు గాలులు బలంగా వీచే అవకాశం ఉండటంతో పాటు తీర ప్రాంతాల్లో వర్షాలు మళ్లీ పెరగనున్నాయన్నారు. ఈ రోజు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో 2 లో..

## సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపిన పవన్ కల్యాణ్

- 30 ఏళ్ల కిందట తొలిసారిగా సీఎం బాధ్యతలు అందుకున్న చంద్రబాబు
- శుభాకాంక్షలు తెలియజేసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో ఆయన ముద్ర చిరస్మరణీయం అని కితాబు



మన గళం, అమరావతి : చంద్రబాబు ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టి నేటికి 30 ఏళ్లయింది. ఈ నేపథ్యంలో ఆయనకు ప్రముఖులు శుభాకా ంక్షలు తెలియజేస్తున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా సీఎం చంద్రబాబును ఉద్దేశించి ప్రత్యేక సందేశం విడుదల చేశారు. చంద్రబాబు దార్శనికత కలిగిన ముఖ్యమంత్రి అని, తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో ఆయన ముద్ర చిరస్మరణీయం అని కొనియాడారు. "భవిష్యత్తును ఊహించి ప్రణాళికబద్ధంగా దూరదృష్టితో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన దార్శనికుడు చంద్రబాబు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేసి నేటికి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు 2 లో..

## రాహుల్ వ్యాఖ్యలను సమాజం తిప్పి కొడుతుంది

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



మన గళం, రాజమండ్రి : బీహార్ ఎన్నికల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ తల్లి పట్ల నీచంగా ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ మాటాడారని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధ వ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ వ్యాఖ్యలను సమాజం కచ్చితంగా తిప్పి కొడుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని దేశవ్యాప్తంగా డిమాండ్ వినిపిస్తోందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఆందోళన చెంది ప్రతిరోజూ అబద్దాలు సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు పీవీఎన్ మాధవ్. ఓటు చోరీ అనే అంశాన్ని తెరపైకి తీసుకొచ్చిన రాహుల్ గాంధీ.. ఏ విషయాన్ని బయట పెట్టలేకపోయారని విమర్శించారు. ఇవాళ(సోమవారం) రాజమండ్రిలో పీవీఎన్ 2 లో..



## కర్నూలు ట్రిపుల్ ఐటీ ప్రపంచంలోనే 9వ స్థానం

- అత్యున్నత ప్రమాణాలతో కర్నూలు ట్రిపుల్ ఐటీ ప్రాంగణం

మన గళం, కర్నూలు శివారులోని జగన్నాథగట్టుపై మొత్తం 151 ఎకరాల విస్తీర్ణంలో రూ.254 కోట్ల వ్యయంతో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ట్రిపుల్ ఐటీ కళాశాల(డీఎం) ప్రాంగణానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది. గతేడాది నవంబరులో సింగపూర్‌లో 'వరల్డ్ ఆర్కిటెక్చర్ ఫెస్టివల్-2024' నిర్వహించారు. అన్ని కేటగిరీల్లో 2 లో..

# ఎస్‌సీఓ సదస్సులో పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ

స్పష్టం చేశారు. మోదీ వ్యాఖ్యలకు పుతిన్ కూడా సానుకూలంగా స్పందించారు. ఎస్‌సీఓ సదస్సులో తన ప్రసంగం సందర్భంగా, ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారంలో భారత్, చైనా వంటి వ్యూహాత్మక భాగస్వాములు అందిస్తున్న సహకారాన్ని తాము ఎంతగానో గౌరవిస్తున్నామని పుతిన్ పేర్కొన్నారు. గత నెలలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కుదిరిన అవగాహనలు ఉక్రెయిన్‌లో శాంతికి మార్గం సుగమం చేశాయని ఆయన ప్రస్తావించారు. ఈ భేటీ తర్వాత ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, పుతిన్‌తో సమావేశం అద్భుతంగా జరిగిందని తెలిపారు. వాణిజ్యం, ఎరువులు, అంతరిక్షం, భద్రత, సాంస్కృతిక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై చర్చించామని వెల్లడించారు. "ఉక్రెయిన్ సంక్షోభానికి శాంతియుత పరిష్కారంతో సహా ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై మేం అభిప్రాయాలు పంచుకున్నాం. మన ప్రత్యేక, విశేషాధికార వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రాంతీయ, ప్రపంచ స్థిరత్వానికి కీలక స్తంభంగా నిలుస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ఎస్‌సీఓ సదస్సు కోసం చైనాకు వచ్చిన వెంటనే శనివారం ప్రధాని మోదీకి ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఫోన్ చేయడం గమనార్హం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, యూరప్ నేతలతో వాషింగ్టన్‌లో జరిగిన చర్చల వివరాలను జెలెన్‌స్కీ ప్రధానికి వివరించారు. ఈ సంక్షోభ పరిష్కారానికి అవసరమైన ప్రయత్నాలు చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని, ఎస్‌సీఓ సదస్సు వేదికగా రష్యాకు సరైన సంకేతాలు పంపుతామని మోదీ ఆయనకు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

# అసెంబ్లీకి రండి తేల్చుకుందాం

ఇస్తున్నాం. దివ్యాంగులకు 12 రెట్లు పెంచింది టీడీపీ ప్రభుత్వమే" అని గుర్తుచేశారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వం అవయవాలన్నీ సక్రమంగా ఉన్న తమ పార్టీ కార్యకర్తలకు కూడా దివ్యాంగుల పెన్షన్ ఇచ్చిందని, ఇలాంటి అనర్హులను ప్రజలే నిలదీయాలని పిలుపునిచ్చారు. అర్హులైన పేదలకే ప్రభుత్వ సంపద అందాలని ఆయన అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై మాట్లాడుతూ, "అప్పు చేసి పప్పు కూడు తింటే చివరికి చిప్పే మిగులుతుంది. అప్పులు చేసి బాగుపడ్డ వారు ఎవరూ లేరు" అంటూ గత ప్రభుత్వ ఆర్థిక విధానాలను చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. ఆదాయాన్ని పెంచి, ఆ సంపదను పేదలకు సంక్షేమం రూపంలో అందించడమే తన విధానమని పునరుద్ఘాటించారు. "నేను ఐటీ, హైటెక్ సిటీ అంటే ఎగతాళి చేశారు. కానీ ఇవాళ ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారు ఉన్నతస్థాయిలో ఉన్నారంటే అందుకు ఐటీనే కారణం. డ్వాక్రా సంఘాలు పెట్టి మహిళలను ఆర్థికంగా నిలబెట్టాం. మేం చేసిన మంచిని ప్రజలు గుర్తుంచుకోవాలి" అని ఆయన కోరారు.

**రాయలసీమకు రత్నాల హారం**

రాయలసీమ అభివృద్ధికి తన ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు హామీ ఇచ్చారు. "రాయలసీమను రతనాల సీమగా మార్చడమే నా లక్ష్యం. సీమకు నీళ్లిచ్చిన ఘనత ఎన్టీఆర్‌ది. ఆయన స్ఫూర్తితో రాయలసీమలో కరవును శాశ్వతంగా దూరం చేస్తాం. నిన్ననే కుప్పానికి నీళ్లు తీసుకెళ్లాను, భవిష్యత్తులో రాజంపేట, కోడూరుకు కూడా సాగునీరు అందిస్తాం" అని భరోసా ఇచ్చారు. కరవు జిల్లా అయిన అనంతపురానికి కియా పరిశ్రమను తీసుకొచ్చి ఆ ప్రాంత రూపురేఖలు మార్చామని, అదే తరహాలో రాయలసీమకు పెద్ద ఎత్తున పెట్టుబడులు



తీసుకొస్తామని తెలిపారు. ఆడబిడ్డల జోలికి వస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని చంద్రబాబు హెచ్చరించారు.

# ప్రజలను మోసం చేసేవాళ్లే గొప్ప లీడర్లు



పరిగణిస్తారని, తాను పనిచేసే రంగంలో మనస్ఫూర్తిగా నిజం మాట్లాడటం నిషిద్ధమని అన్నారు. నిర్మొహమాటంగా మాట్లాడతారనే పేరున్న గడ్కరీ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. వివరాల్లోకి వెళితే, నాగ్‌పూర్‌లో 'అఖిల భారత మహానుభావ పరిషత్తు' నిర్వహించిన ఒక కార్యక్రమంలో నితిన్ గడ్కరీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవితంలో విజయం సాధించడానికి అడ్డదారులను ఎంచుకోవద్దని ప్రజలకు సూచించారు. "ఏదైనా సాధించడానికి ఒక షార్ట్ కట్ ఉంటుంది. కానీ, మీరు షార్ట్ కట్ వాడితే, అది మిమ్మల్ని షార్ట్‌గా కట్ చేస్తుంది. అందుకే నిజాయతీ, విశ్వసనీయత వంటి విలువలను పాటించాలి" అని ఆయన హితవు పలికారు. సమాజంలో నిజం, అంకితభావం వంటి విలువలు దీర్ఘకాలిక విజయాన్ని అందిస్తాయని గడ్కరీ పేర్కొన్నారు. అంతిమంగా నిజమే గెలుస్తుందని భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన మాటలను ఆయన గుర్తుచేశారు. ఈ క్రమంలోనే ఆయన రాజకీయాలపై తన మార్క్ సెటైర్లు వేశారు. గడ్కరీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా ప్రభుత్వ నిర్ణయాలపై కోర్టులను ఆశ్రయించడం వల్లే పరిపాలనలో క్రమశిక్షణ పెరుగుతోందని అన్నారు. మంత్రులు చేయలేని పనులను న్యాయస్థానాలు చేయిస్తాయని అభిప్రాయపడ్డారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా మంచి పనులు చేసే నేతలకు గౌరవం, చెడు పనులు చేసేవారికి శిక్షలు ఉండవని గతంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్ అయిన విషయం తెలిసిందే.

# రాహుల్ వ్యాఖ్యలను సమాజం కచ్చితంగా తిప్పి కొడుతుంది

మాధవ్ పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. బీజేపీ ఏపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సారథ్యం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 19 జిల్లాల్లో పర్యటించానని తెలిపారు. ఈరోజు(సోమవారం) తూర్పుగోదావరి జిల్లాకు చేరుకున్నానని చెప్పుకొచ్చారు. అత్యంత ప్రాశస్త్యం, తెలుగు భాషకు పుట్టినిల్లు, కందుకూరి వీరేశలింగం లాంటి వ్యక్తులు నడయాడిన నేల రాజమహేంద్రవరానికి రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఉద్ఘాటించారు పీవీఎన్ మాధవ్. సాహిత్య స్వాతంత్ర్య సమరయోధులను గుర్తు చేసుకుంటూ అనేక చోట్ల సారథ్యం కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు. రాజమండ్రి పుష్కరాలకు టూరిజం పరంగా ఇప్పటికే కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్, సీఎం చంద్రబాబు టూరిజం ఆధ్వర్యంలో ఢిల్లీలో కూడా సమావేశం నిర్వహించారని గుర్తుచేశారు. కుంభమేళా తరహాలోనే రాజమండ్రి పుష్కరాలకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. రాజమండ్రి పుష్కరాలకు కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సహకారం అందిస్తోందని వెల్లడించారు.

# ఏపీలో మూడు రోజులపాటు భారీ వర్షాలు



మోస్తరు వర్షాలు, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. తీరం వెంబడి గంటకు 40%60 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గురువారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని ఆయన సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ సరఫరా అంతరాయం, వరదల ప్రమాదాలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

# కర్నూలు ట్రిపుల్ ఐటీ ప్రపంచంలోనే 9వ స్థానం

కలిపి ప్రపంచ వ్యాప్తంగా మొత్తం 760 సంస్థలు ఇందులో పోటీపడ్డాయి. అందులోని అత్యుత్తమ ప్రాంగణాలను ఇటీవల ప్రకటించగా అత్యుత్తమ ఆర్కిటెక్చర్ నైపుణ్యాలతో నిర్మించిన ప్రాంగణాల్లో 'ఇన్‌స్టిట్యూషన్స్' కేటగిరీలో మన దేశం నుంచి కర్నూలులోని ట్రిపుల్ ఐటీ (డీఎం) ప్రాంగణం తొమ్మిదో స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల సంస్థలతో పోటీపడి ఈ స్థానాన్ని సాధించడం విశేషం. కర్నూలు ట్రిపుల్ ఐటీ ప్రాంగణాన్ని విద్యార్థులకు అత్యంత సౌకర్యవంతంగా ఉండే విధంగా స్వచ్ఛమైన గాలి, వెలుతురును లభించేలా వాటిని అత్యాధునిక హరిత భవనాలుగా నిర్మించారు. వీటితో పాటు భారీ భూకంపాలను తట్టుకునేలా నిర్మించడం మరో ప్రత్యేకతగా చెప్పవచ్చు. కళాశాల ప్రాంగణంలోని దాదాపు 151 ఎకరాల్లో ప్రస్తుతం 40 ఎకరాల్లో నిర్మాణాలు ఉండగా అందులో సుమారు 12 ఎకరాల్లో ఐదు వేల మొక్కల వరకూ నాటారు. రెండో దశలో మరో 25 ఎకరాల్లో మొక్కలు పెంచేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. పల్లపు ప్రాంతాలోని ప్రదేశాల్లో సుందరమైన ఫౌంటెన్లను ఏర్పాటు చేశారు. భవనాల మధ్య రాకపోకల కోసం అంతర్గత వంతెనలను సైతం నిర్మించారు. వర్షం కురిసినప్పుడు ఆ నీటిని ఒడిసి పట్టేందుకు వీలుగా రెండు లక్షల సామర్థ్యంతో 4 సంపులను నిర్మించారు. ఆ నీటిని అధునాతన విధానాల్లో శుద్ధి చేసి రోజువారీ అవసరాలకు వినియోగించుకునే సౌకర్యం ఉంది. ప్రాంగణంలోని వర్షపు నీరు వృథా కాకుండా మూడు చెక్‌డ్యామ్‌లను ఏర్పాటు చేశారు. ఇవి సుమారు పది లక్షల లీటర్ల వరకూ వర్షపు నీటిని ఎటువంటి వృథా పోకుండా అడ్డుకుంటాయి.

# రాజకీయ పార్టీలు, ఈసీ మధ్య విభేదాలు బాధాకరం : సుప్రీంకోర్టు

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, ఎన్నికల సంఘం ఆగస్టు 1న ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేసింది. దీనిపై అభ్యంతరాలు తెలిపేందుకు సెప్టెంబర్ 1ని తుది గడువుగా నిర్ణయించింది. ఈ గడువును పొడిగించాలని కోరుతూ కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఈరోజు విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం తన వైఖరిని తెలియజేసింది. అభ్యంతరాలను సెప్టెంబర్ 30 తర్వాత కూడా స్వీకరిస్తామని, నామినేషన్ల ప్రక్రియ ముగిసేంత వరకు సవరణలు కొనసాగుతాయని సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. ఈసీ వివరణ అనంతరం, సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సంఘం, రాజకీయ పార్టీల మధ్య ఇలాంటి విభేదాలు తలెత్తడం దురదృష్టకరమని అభిప్రాయపడింది. అదే సమయంలో, ఓటర్ల జాబితాలో ఫిర్యాదులు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వాలంటీర్లను నియమించాలని బీహార్ లీగల్ సర్వే అథారిటీని ఆదేశించింది. కాగా, ఈసీ విడుదల చేసిన ముసాయిదా జాబితా నుంచి సుమారు 65 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించడం, పౌరసత్వంపై అనుమానాలున్న 3 లక్షల మందికి నోటీసులు జారీ చేయడం రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.

# శ్రీ సత్యసాయి జిల్లాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దారుణహత్య

- బ్యాంకు లోన్ కమీషన్ విషయంలో చోటు చేసుకున్న గొడవలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దారుణహత్య
- తొడపై విచక్షణారహితంగా పొడవడంతో విపరీతమైన రక్తస్రావమై మృతి చెందిన శ్రీకాంత్

మన గళం డెస్క్ : శ్రీ సత్యసాయి జిల్లాలో దారుణం జరిగింది. బ్యాంకుల్లో ఇప్పించే లోన్ కమీషన్ విషయంలో చోటు చేసుకున్న గొడవలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రీకాంత్ (30) దారుణహత్యకు గురయ్యాడు. కత్తితో శ్రీకాంత్ తొడపై పొడవడంతో విపరీతమైన రక్తస్రావంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్పై నరసింహుడు తెలిపిన వివరాల మేరకు, శ్రీ సత్యసాయి జిల్లా తలుపులకు చెందిన డిష్ శ్రీనివాసులు కుమారుడు అనిరుధ్ వివిధ బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేవాడు. ఈ క్రమంలో బలిజపేటకు చెందిన శోభకు రుణం ఇప్పించాలని అదే కాలనీకి చెందిన రాజారాం ఆమెను అనిరుధ్‌కు పరిచయం చేశాడు. అయితే రాజారాం, అనిరుధ్ కుటుంబాల మధ్య అప్పునకు సంబంధించిన వివాదంతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే శోభకు ఇప్పించిన రుణంలో తనకూ కమీషన్ కావాలని రాజారాం శనివారం రాత్రి అనిరుధ్ ఇంటిపైకి వెళ్లి ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశాడు. ఆ సమయంలో అనిరుధ్ కుటుంబసభ్యులు అనంతపురంలో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న అనిరుధ్, అతని తండ్రి శ్రీనివాసులు తలుపులకు వచ్చారు. అనంతరం అనిరుధ్ బావమరిది శ్రీకాంత్ (30)తో కలిసి తండ్రి శ్రీనివాసులు, తమ్ముడు శ్రీకర్‌లు శనివారం రాత్రి 12.30 గంటల సమయంలో రాజారాం ఇంటివద్దకు వెళ్లారు. విషయం తెలుసుకున్న రాజారాం, తండ్రి వెంకటరాయప్ప, తరుణ్?లు ముందస్తు ప్రణాళికతో ఉన్నారు. అనంతరం వారు వచ్చాక తనను చంపుతారన్న భయంతో రాజారాం ముందుస్తుగా ఏర్పాటు చేసుకున్న కత్తితో శ్రీకాంత్ తొడపై విచక్షణారహితంగా పొడవడంతో విపరీతమైన రక్తస్రావం జరిగి కదిరి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ గొడవలో శ్రీకర్‌కు, అతని తండ్రి శ్రీనివాసులకు గాయాలయ్యాయి. నిందితుడి తండ్రి వెంకటరాయప్ప, తరుణ్‌ను అదుపులోకి తీసుకొన్నట్లు ఎస్పై నరసింహుడు చెప్పారు. రాజారాం పరారీలో ఉన్నట్లు చెప్పారు.

# సీఎం చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపిన పవన్ కల్యాణ్

తెలియజేస్తున్నాను. పాలనా దక్షతతో ఆయన చేపట్టిన కార్యక్రమాలు, సంస్కరణలు అభివృద్ధిని పరుగులు పెట్టించాయి. పాలనలో ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా సవాళ్లుగా స్వీకరించి ముందడుగు వేశారు. హైదరాబాద్ మాదాపూర్ ప్రాంతంలో కొండలు, గుట్టలుగా ఉన్న ప్రాంతాన్ని ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రస్ గా మార్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. 90వ దశకంలో ఆయన ఐటీ రంగానికి పెద్దపీట వేయడం వల్లే తెలుగు రాష్ట్రాల్లో మారుమూల గ్రామాల నుంచి ఐటీ ఉద్యోగులు వచ్చారు. రైతు బజార్ల ఏర్పాటు, డ్వాక్రా సంఘాల స్థాపన, పేదల కోసం వెలుగు ప్రాజెక్టు ప్రారంభం, మీసేవా కేంద్రాల ఏర్పాటు వంటి నూతన ఆవిష్కరణలు చంద్రబాబు ముందుచూపునకు నిదర్శనం. రాష్ట్ర విభజన అనంతరం క్లిష్ట సమయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రాజధాని లేని రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ను ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లారు. ప్రజా రాజధానిగా అమరావతి, రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టు, వీటితోపాటు పారిశ్రామికవృద్ధి లక్ష్యంగా 2014లో పాలన మొదలుపెట్టారు.

# ప్రేమించిన యువతితో కోసం టవర్ ఎక్కిన యువకుడు

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలన్న ఆశతో ఓ యువకుడు సెల్ టవర్‌పై ఎక్కి హంగామా చేశాడు. ఈ సంఘటన శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో సోమవారం జరిగింది. పొందూరు మండలం కింతలి కనిమెట్టకు చెందిన శివకుమార్ అనే యువకుడు.. ఎచ్చెర్ల మండలం ఇబ్రహీంపాట్‌కు చెందిన ఇందుమతి అనే యువతిని గత ఐదేళ్లుగా ప్రేమిస్తున్నాడు. కానీ ఇద్దరూ వేర్వేరు కులాలకు చెందడం వల్ల.. అమ్మాయి కుటుంబం ఈ పెళ్లికి ఒప్పుకోవడంలేదని శివకుమార్ చెబుతున్నాడు. తాజాగా తనపై ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేశారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ శ్రీకాకుళంలో దీపమహల్ దగ్గర ఉన్న సెల్ టవర్‌పై ఎక్కిపోయాడు. వెంటనే 112కు కాల్ చేసి తన గోడును పోలీసులకు చెప్పాడు.

## సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించాలి



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ఆలూరు నియోజకవర్గం లో నిర్మించిన ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతూ సోమవారం డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఆలూరు నియోజకవర్గం ఆస్పరి, హాలహరి, చిప్పగిరి హొలగుంద మండలాలకు ప్రధాన కేంద్రం అని ఆరోగ్య కేంద్రాన్నిత్వరగా ప్రారంభించి ప్రజలకు వైద్య సేవలు అందేలా చూడాలని ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా, ఉపాధ్యక్షుడు హుస్సేన్ బాషా కలెక్టర్ ను కోరారు. స్పందించిన కలెక్టర్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ప్రజల సమస్యలను సీరియస్ గా తీసుకోవాలి

- అర్జీలను నిర్ణీత గడువు లోపు నాణ్యతగా పరిష్కరించండి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ప్రజల సమస్యలను సీరియస్ గా తీసుకోవాలని, అర్జీలను నిర్ణీత గడువు లోపు నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. ప్రజల సంతృప్త స్థాయిలు పెరిగేలా అర్జీల పరిష్కారం ఉండాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. అర్జీదారులతో వ్యక్తిగతంగా మాట్లాడితే... నాణ్యతగా పరిష్కారం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లాగిన్ లో పరిష్కారం చేసిన అర్జీల నాణ్యతను ఆడిట్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సీఎంఓ గ్రీవెన్స్ లకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 12, పత్తికొండ ఆర్డీఓ వద్ద 6, కర్నూలు ఆర్డీఓ వద్ద 8, కలెక్టరేట్ ఏవో వద్ద 3, సర్వే ఏడీ, హౌసింగ్ పీడీ, డీ ఆర్ డీఏ పీడీ ల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్ లో ఉన్న వాటిని గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా బి.నవ్య, డీఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ఆదోని మండలం, సంతెకూడ్లూరు గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడానికి అవకాశాన్ని ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. గత మూడు సంవత్సరాల క్రితం సంతెకూడ్లూరు గ్రామంలో జఠిలంగా కొనసాగిన అంటరానితనాన్ని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో యువకులంతా ఐక్యంగా ప్రతిఘటన ద్వారా రూపుమాపారని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్ బాబు, జిల్లా సహాయ కార్యదర్శులు బి తిక్కప్ప, ఎం భాస్కర్, సంతెకూడ్లూరు గ్రామ అధ్యక్షులు రాము, గ్రామ నాయకులు ఈరన్న తదితరులు కలెక్టర్ కు తెలిపారు. అదే ఐక్యతతో గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ముందుకొచ్చారని, స్థలం కేటాయించాలని వారు కలెక్టర్ ను కోరారు.

## కార్మిక రాజ్యం కోసం ఐక్యంగా ఉద్యమించాలి

మనగళం, కర్నూలు సిటీ : నగరంలోని కార్మిక కర్షక భవన్ నందు కర్నూలు న్యూ సిటీ 3వ మహాసభలు కార్మిక కర్షక భవన్ ఘనంగా జరిగాయి. మొదట ఈ మహాసభల ప్రారంభ సూచికగా సీనియర్ నాయకులు ఎం. గోపాల్ పతాకావిష్కరణ చేశారు. మహాసభకు అధ్యక్ష వర్గంగా నరసింహులు, కే ప్రభాకర్, మహమ్మద్ రఫీ వ్యవహరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పియస్.రాధాకృష్ణ, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి .నిర్మల, జిల్లా కార్యదర్శి యండి.అంజిబాబు మాట్లాడారు. రాబోయే కాలంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడుతూనే కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి కార్మిక రాజ్యం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి బృందం పాటలు కార్మిక వర్గాన్ని ఉత్తేజపరిచారు. అనంతరాము నగర కార్యదర్శి సియచ్. సాయిబాబా నిర్మాణ కార్యక్రమాల నివేదికనీ ప్రవేశపెట్టారు. యూనియన్లు రంగాలవారీగా చర్చలు జరిపి మహాసభల ముందు ప్రతినిధులు వారి యూనియన్లకు సంబంధించిన రిపోర్టును ప్రవేశపెట్టారు. మహాసభలో సీఐటీయూ నగర ఆఫీస్ బేరర్స్ టి.రాముడు,




సుధాకరప్ప, వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, యేసు, నాయకులు నగేష్, రామకృష్ణ, చలపతి లక్ష్మీబాయి,కుమారి, పర్వీన్ వందమంది ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు న్యాయం చేయాలి



మనగళం, కర్నూలు సిటీ : శ్రీ శక్తి పథకం ద్వారా నష్టపోతున్న ఆటో కార్మికులకు నెలకు 12 వేలు ఇవ్వాలని, ఏటీసీ సెంటర్ లను రద్దు చేయాలని సీఐటీయూ ఓల్డ్ సిటీ సెక్రెటరీ విజయ రామాంజనేయులు, నగర ఆఫీస్ బేరర్స్ అబ్దుల్ దేశాయ్, నాగస్వాములు, రామకృష్ణ, ఆటో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి మహమూద్ డిమాండ్ చేశారు. ఏపీ ఆటో అండ్ ఫోర్ వీలర్ డ్రైవర్స్ యూనియన్ ( సీఐటీయూ) ఓల్డ్ సిటీ కమిటీ కర్నూలు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ఆటో యూనియన్ నగర అధ్యక్షులు డి కుమార్ అధ్యక్షతన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నగరంలో చదివిన చదువులకు ఉద్యోగ ఉపాధి అవకాశం దొరకక చాలామంది నిరుద్యోగులు ఆటో ల ద్వారా ఉపాధి పొందుతూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం అమలు చేస్తున్న శ్రీ శక్తి పథకం మహిళలకు ఉపయోగకరం అయినప్పటికీ ఆటో కార్మిలకు నష్టం వాటిల్లుతోందని, ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం వచ్చినప్పటి నుండి ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరిస్తూ ఉన్న ఉద్యోగాలను ఊడదీసి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. ఇలాంటి విధానాలను దేశవ్యాప్తంగా అమలు చేయడం వలన రవాణా రంగం కుదేలై వాటిపై ఆధారపడి బతుకుతున్న కార్మికుల కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ ఆఫీస్ బ్యాలెన్స్ మూర్తుజావలి, త్యాగరాజు, గోపాలకృష్ణ, బడే బాషా, వెంగళరావు, వెంకటేష్, శ్రీను, నాగరాజు మరియు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ పథకాలు... సూపర్ హిట్

- పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి. భరత్



మనగళం, కర్నూలు సిటీ : కూటమి ప్రభుత్వానికి ప్రజల సుఖ సంతోషాలు ముఖ్యమని, అందుకే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి సూపర్ హిట్ అన్న ప్రశంస తెచ్చుకున్నదని వాణిజ్యం, పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం కొత్తపేటలోని క్లస్టర్ 12 మంగలి వీధిలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి టి. జి. భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు విచారించి పెన్షన్ల పంపిణీ చేశారు. లబ్ధిదారులకు మంత్రి స్వయంగా పింఛన్ సొమ్ము అందజేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఏ విధంగాపని చేస్తుందని మంత్రి ప్రశ్నించగా మేము ఈ ప్రభుత్వంలో చాలా సంతోషంగా ఉన్నామని సమాధానం ఇచ్చారు. ఈ కూటమి ప్రభుత్వం ఒకటో తారీకు సెలవు దినమైనప్పుడు పెన్షన్ ను ఒక రోజు ముందుగానే అందజేస్తుందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వెయ్యి రూపాయల మొత్తాన్ని ఒకటేసారి పెంచి రూ. 4 వేలు ఇస్తున్నామని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు ప్రజల అభినందనలతో సూపర్ హిట్ అయ్యాయని చెప్పారు. అర్హులందరికీ ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.

## లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కండి

మనగళం, కర్నూలు సిటీ : కర్నూల్ నగర సీఐటీయూ న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సీఐటీయూ, నగర కమిటీ మూడవ మహాసభ ఉదయం 11 గంటలకు కార్మిక కర్షక భవన్లో ప్రారంభమైంది. సీఐటీయూ పతాకాన్ని ఆ సంఘం జిల్లా నాయకులు ఏం గోపాల్ ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి కార్మికులు శ్రద్ధాంజలి ఘటించారు. మహాసభలో మూడు సంవత్సరాల కాలంలో ఉద్యమాలలో పాల్గొని, అమరులైన కామ్రేడ్లకు, అనారోగ్యాలకు గురై మరణించిన వారికి, ప్రకృతి విపత్తులలో చనిపోయిన ప్రజానీకానికి బి. రాధాకృష్ణ సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా మహాసభకు హాజరైన ప్రతినిధులు, ఒక నిమిషం మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. మహాసభ కు నగర ఉపాధ్యక్షులు కే ప్రభాకర్ ఎస్ఎండి రఫీ, నగర అధ్యక్షులు నర్సింలు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎండి అంజిబాబు పిఎస్ రాధాకృష్ణ పి నిర్మల లు మాట్లాడారు. నరేంద్ర మోడీ కార్మిక వర్గాన్ని బలి పశు వులుగా చేయడానికి బ్రిటిష్ కాలం నుంచి కొనసాగుతున్న కార్మిక చట్టాలు అన్నిటిని రద్దుచేశారన్నారు. 44 చట్టాల ను కుదించి వాటి స్థానంలో, నాలుగు లేబర్, కోడ్ల పేరుతో హక్కులు హరించి వేశారని విమర్శించారు. కార్పొరేట్ శక్తులు కార్మిక వర్గాన్ని మరింత శ్రమ దోపిడీకి గురి చేసే విధంగా ఈ లేబర్ కోడ్ లు తీసుకొచ్చారని ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, ఆర్ పి ల పై విపరీతమైన పని భారం పెంచుతున్నారని దానికి తగ్గ కనీస వేతనం ఇవ్వకుండా వేధిస్తున్నారని విమర్శించారు. అంగన్వాడీలకు కనీసం వేతనం అమలు కాకుండా సంక్షేమ పథకాలు




రద్దు చేశారని, ఇది దుర్మార్గమైన చర్య అని అన్నారు. మహాసభలో కార్మిక వర్గాన్ని బలిపశువులుగా, మార్చే లేబర్ కోడ్లను రద్దుచేసి పాత చట్టాలను అమలు చేయాలని, స్కీం వర్కర్ లందరికీ కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వడంతోపాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని తీర్మానించారు. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో సీఐటీయూ నగర ఆఫీస్ బేరర్స్ సి. హెచ్ సాయిబాబా, నరసింహులు, యం గోపాల్, కే ప్రభాకర్, బి రాధాకృష్ణ, కే సుధాకరప్ప, జి. ఏసు, యం వెంకటేశ్వర్లు, ఎస్ ఎం డి. రఫీ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో నగరంలోని నీ సిటీ కమిటీ పరిధిలోని హమాలీలు, ఆటో కార్మికులు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, ఆర్పీలు వందల సంఖ్యలో హాజరయ్యారు.

## ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజం






మనగళం, కర్నూలు కలెక్టరేట్ : కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సీపీఓ గా పదవీ విరమణ చేసిన హిమ ప్రభాకర్ రాజు, భూగర్భ జల శాఖ శాఖ డీడీ శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. వారికి శాలువాలు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజం అన్నారు. పదవీ విరమణ చేసిన సీపీఓ, భూగర్భజల శాఖ డిప్యూటీ డైరెక్టర్ అందించిన సేవలు అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో డీఆర్ఓ సి వెంకటనారాయణమ్మ, పీడీ హౌసింగ్ చిరంజీవి, జడ్పీ సీఈవో నాసర రెడ్డి, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, డ్వా మా పీడీ వెంకటరమణయ్య, ఆర్ అండ్ బీ ఎస్ ఈ మహేశ్వర్ రెడ్డి, మైనింగ్ డీడీ రవిచంద్, డీఎస్ఓ రఘువీర్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి దీప్తి, గ్రౌండ్ వాటర్ డీడీ సన్నన్న, సీపీఓ భారతి, డీటీసీ శాంత కుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ కుమార్, డీఆర్డిఏ పీడీ రమణారెడ్డి, డీడీ సోషల్ వెల్ఫేర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

## నగరపాలకలో 'హెల్ప్ డెస్క్' ఏర్పాటు




మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సహాయం ఉండేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ మేనేజర్ ఎన్.చిన్నరాముడు తెలిపారు. సోమవారం ఆయన హెల్ప్ డెస్క్ సిబ్బందికి సూచనలు చేశారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు మర్యాదపూర్వకంగా సమాధానం ఇవ్వాలని, వారు అడిగిన సమాచారాన్ని స్పష్టంగా తెలియజేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## కర్నూల్‌లో జోన్-5 మహిళా సదస్సులో - మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ గారు విమర్శలు




మనగళం, కర్నూలు : కర్నూల్ ఎస్సీ కాంప్లెక్స్‌లో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ మనోహరి ఆధ్వర్యంలో జోన్-5 రాష్ట్ర మహిళా సదస్సు జరిగింది. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ వరదు కళ్యాణి, నంద్యాల జిల్లా కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి పర్యవేక్షణలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంలో పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళా వ్యతిరేక ప్రభుత్వం నడుస్తోందని ధ్వజమెత్తారు. మహిళలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా ఏ ఒక్క పథకం సక్రమంగా అమలు కాలేదని విమర్శించారు. 19-59 ఏళ్ల మహిళలకు నెలకు ?1,500 ఆడబిడ్డ నిధి ఇస్తామని చెప్పి, ఇప్పుడు దాని గురించి ప్రస్తావనే లేనని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం పేరుతో 11 రకాల సర్వీసుల్లో కేవలం 5 సర్వీసుల్లోనే అనుమతిస్తున్నారని ఎద్దేవా చేశారు. 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ?3,000 హామీలు కూడా నెరవేరలేదన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోగా, ఉన్న పింఛన్లు కూడా తొలగించారని ఆరోపించారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్న హామీపై మొదటి ఏడాది ఒకదానినే ఇచ్చారని పేర్కొన్నారు. "అమ్మ ఒడి" పథకాన్ని కాపీ చేసి "తల్లికి వందనం" పేరుతో ప్రకటించినా, అది కూడా మొదటి ఏడాది అమలు కాలేదన్నారు.

అంతేకాక,

జగనన్న వైఎస్ఆర్ ఆసరా కింద 78,94,169 మంది మహిళలకు ?25,570 కోట్లు, వైఎస్ఆర్ చేయూత కింద 26,98,933 మంది మహిళలకు ?19,189 కోట్లు లబ్ధి చేకూర్చామని గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం మహిళలను పూర్తిగా మోసం చేస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. ఈ సమావేశంలో నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లా మహిళా అధ్యక్షులు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు, జడ్పీటిసి, ఎంపీపీలు, మహిళా విభాగ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : రాష్ట్రంలోని ఆర్టీఈ విద్యార్థుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని రాయలసీమ విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు, బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పగడాల ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్పెషల్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "విద్యా హక్కు చట్టం%-%2009 అమలుకు రాష్ట్రవ్యాప్తంగా "పోరుబాట" కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాల ఫీజు బకాయిలు చెల్లించడంతో పాటు, ప్రభుత్వం విద్యాసంస్థలకు ఇస్తున్న ఫీజును రూ. 30 వేలకు పెంచాలని, ఆర్టీఈ విద్యార్థులకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మార్కులు%-%హాజరు పర్యవేక్షణను మండల విద్యా శాఖ అధికారులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీఈ పేరెంట్స్ సమితి నాయకులు ఖాదర్ ఖాన్, అశోక్, నగేష్, విశ్వనాథ్ యాదవ్, ఉసేన్ ఫిరా, రవి, మహేంద్ర, షకీల్, విద్యార్థి సంఘాల నాయకులు గణేష్, జయకృష్ణ, ఆనంద్, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధన్యవాదాలు!

## జీమెయిల్ వినియోగదారులకు గూగుల్ వార్నింగ్

మనగళం, ప్రపంచ వ్యాప్తంగా సుమారు 250 కోట్ల జీమెయిల్ వినియోగదారులకు గూగుల్ వార్నింగ్ ఇచ్చింది. అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల నుండి హ్యాకింగ్ దాడులు భారీగా పెరిగిపోయాయని, ఖాతాలపై తక్షణమే ప్రతిఒక్కరూ దృష్టి పెట్టాలని సూచించింది. యూజర్లు తమ పాస్‌వర్డ్‌లను మార్చుకోవడంతో పాటు టూ స్టెప్ వెరిఫికేషన్ అనే అదనపు ఫీచర్ ఖచ్చితంగా ఆన్ చూసుకోవాలని సూచించింది. చిన్నపాటి జాగ్రత్తల ద్వారా సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఖాతాలను సురక్షితంగా ఉంచుకోవాలని పేర్కొంది. ముఖ్యంగా సైబర్ దాడుల వెనుక షైనీహంటర్స్ అనే అంతర్జాతీయ హ్యాకర్ల ముఠా ఉందని గుర్తించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ ముఠా అనేక సంస్థలపై దాడులు చేసి సైబర్ మోసాలకు పాల్పడినట్టు పేర్కొంది. గతంలో ఐటీ అండ్ టీ, మైక్రోసాఫ్ట్, టికెట్ మాస్టర్ లాంటి దిగ్గజ సంస్థల నుండి కీలక సమాచారాన్ని దొంగలించడంతో షైనీ హంటర్స్ ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. హ్యాకర్లు ఫిషింగ్ అనే పద్ధతి ఉపయోగిస్తూ యూజర్లను నమ్మించేలా మెయిల్స్ పంపి వాటి ద్వారా మోసపూరిత పేజీలకు మళ్లిస్తున్నట్టు గుర్తించారు. ఆ పేజీలోకి యూజర్లు వెళితే యూజర్ నేమ్, పాస్‌వర్డ్ ఎంటర్ చేయగానే వివరాలు హ్యాకర్ల చేతికి వెళతాయి. ప్రమాదాన్ని ముందే పసిగట్టిన గూగుల్ యూజర్లకు ఆగస్ట్ 8వ తేదీన ఈమెయిల్స్ పంపి వారిని అలర్ట్ చేసింది.

# సంస్కరణలకు నాంది పలికిన నేత చంద్రబాబు నాయుడు


- ఎమ్మెల్సీ బీటీ నాయుడు

మనగళం, కర్నూలు సిటీ : నారా చంద్రబాబు నాయుడు తొలిసారి( (1995 సెప్టెంబర్ 1న) ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి 30 సంవత్సరాలు అయ్యిందని, ఆయన సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్సీ బీటీ.నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం బీటీ నాయుడు విలేకరులతో మాట్లాడారు. "చంద్రబాబు నాయుడు నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఈ మూడు దశాబ్దాల కాలం, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక మైలురాయి అన్నారు. ప్రజల వద్దకు పాలన తీసుకెళ్లిన నాయకుడిగా, సంస్కరణలకు నాంది పలికిన దూరదృష్టి గల నేతగా ఆయన గుర్తింపు పొందారని, ఆయన ప్రవేశపెట్టిన అనేక పథకాలు, కార్యక్రమాలు సమాజంలోని ప్రతి వర్గాన్నీ తాకాయని చెప్పారు. జన్మభూమి, క్లీన్ అండ్ గ్రీన్, దీపం, ఆదరణ, డ్వాక్రా వంటి కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాయన్నారు. మహిళలకు, బీసీలకు రిజర్వేషన్లు, మైనారిటీలకు ప్రత్యేక పథకాలు, ఎస్సీల కోసం పున్నయ్య కమిషన్ సిఫార్సుల అమలు, ఎస్సీ వర్గీకరణ వంటి నిర్ణయాలు సామాజిక న్యాయానికి పునాది వేశాయని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక, సాంకేతిక అభివృద్ధికి ఆయన చేసిన కృషి అమూల్యం. విద్యుత్ రంగ సంస్కరణలు, ప్రైవేట్ రంగంలో తొలి విమానాశ్రయం, టెలికాం రంగంలో కీలక సూచనలు, నేషనల్ హైవేలు, గ్రామీణ రహదారుల విస్తరణ %-% ఇవన్నీ ఆయన విజనరీ లీడర్‌షిప్ కు నిదర్శనం అని పేర్కొన్నారు. హైటెక్ సిటీ నిర్మాణం, విజన్ 2020, నాలెడ్జ్ ఎకానమీ ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ మ్యాప్ పై నిలిపారని తెలిపారు. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీలు, పెద్ద ఎత్తున ఇంజనీరింగ్ కాలేజీల స్థాపన, లక్షలాది మంది ఉపాధ్యాయుల నియామకం వంటి నిర్ణయాలు విద్యా, వైద్య రంగాలను విస్తృతంగా అభివృద్ధి చేశాయని వివరించారు. రైతుల కోసం తొలిసారి డ్రిప్ ఇరిగేషన్ టెక్నాలజీ, సాగునీటి ప్రాజెక్టులు, యాంత్రీకరణ, సబ్సిడీలతో అన్నదాతకు అండగా నిలిచారన్నారు. నదుల అనుసంధానం, పేదరిక నిర్మూలన కార్యక్రమాలు, అన్నా క్యాంటీన్లు, స్వచ్ఛభారత్, డిజిటల్ కరెన్సీ కమిటీ, రియల్ టైం గవర్నెన్స్, అమరావతి నిర్మాణం వంటి నిర్ణయాలు ఆయన ఆధునిక ఆలోచనలను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ఈ 30 సంవత్సరాల ప్రయాణం, అభివృద్ధి %-% సంక్షేమం %-% పారదర్శక పాలనల సమన్వయంతో నడిచిందని తెలిపారు. చంద్రబాబు చూపించిన దారిలోనే ఆధునిక ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ఆయన సేవలు చరిత్రలో శాశ్వతంగా నిలుస్తాయని ఈ సందర్భంగా బీటీ నాయుడు వివరించారు.

# ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం



- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగర ప్రజలు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా తెలుపుతున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక సంస్థ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17 అర్జీలు వచ్చాయని కమిషనర్ తెలిపారు. ఇందిరాగాంధీ నగర్ నందు తమ గృహాలకు తమ నివాస గృహాలకు కొళాయి కనెక్షన్లు ఇవ్వాలని స్థానికులు బి.రేఖ, కళ్యాణ్, జి.నాగరాజు విన్నవించారు. ఎఫ్‌సిఐ కాలనీ శ్రీశైల దేవస్థాన ఉద్యోగుల కాలనీలో డ్రైనేజీలు, రహదారులు నిర్మించాలని స్థానికులు అశోక్ గౌడ్, రాజేష్, మల్లికార్జున, తదితరులు కోరారు. స్టాంటన్ వాసవి నగర్ నందు తాగునీటి పైప్‌లైన్ లీకవ్వుతుందని, మరమ్మత్తు పనులు చేపట్టాలని కె.సుధాకర్ రెడ్డి కోరారు.

శ్రీనివాస్ నగర్ నందు సిసి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎస్.జాలుద్దీన్, రాము, తదితరులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్ రెడ్డి, టిపిఆర్ఓ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లి రైతులను ఆదుకోవాలని ధర్నా




మనగళం, కర్నూలు సిటీ : ఏపీ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం కర్నూలు కలెక్టర్ ఆఫీస్ ముందు నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఏపీ రైతు సంఘం కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి దంభోళంశ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాను ఉద్దేశించి సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం మాట్లాడారు. గత రెండు రోజులుగా కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లికి గిట్టుబాటు ధర లేక ఉల్లి రైతులు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రకృతి ఎర్ర చేయడం, మరోవైపు ధరలు సరిగా రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మార్కెట్ యాడ్ కుతీసుకొస్తే కొనుగోలుదారులు సిండికేట్ అయి ఉల్లి రైతులను మోసం చేసే పరిస్థితి ఏర్పడిందనంరాకె, రైతుల నుంచి వ్యాపారస్తులు కింటాం రూ. 300 నుండి రూ. 600 వరకు వేలం వేస్తున్నారని ఆరోపించారు. ఉల్లిగడ్డలు బయట కిలో 20 రూపాయల నుంచి 25 రూపాయలు అమ్ముతున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. రైతులకు ఇంత అన్యాయం జరుగుతున్నా ప్రభుత్వం, అధికారులు కూడా ఏమి పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉల్లి కింటాంకు రూ. 3,000 ప్రకారం చెల్లించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, డీహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల మహేష్, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు అన్వర్ కుమార్, దొడ్డిపాడు బాషా, పెద్దటేకూరు పుల్లన్న, కోటమ్మ, శివరాముడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ సభ్యత నమోదు మరోవారం కొనసాగిస్తాం



మనగళం, కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు ప్రెస్ క్లబ్ సభ్యత్వ నమోదు మరోవారం పాటు కొనసాగిస్తామని క్లబ్ అధ్యక్షుడు కొత్తూరు సత్యనారాయణ గుప్త తెలిపారు. వాస్తవానికి ఆగస్టు 31వ తేదీతో సభ్యత్వ నమోదు ముగిసిందని, గణేష్ ఉత్సవాల నేపథ్యంలో విలేకరుల సూచన మేరకు మరోవారం రోజులపాటు ఈ నెల 7వ తేదీ వరకు కొనసాగిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విలేకరులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రెస్ క్లబ్ లో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. విలేకరుల కోసం ఎంతో శ్రమించి ప్రెస్ క్లబ్ మంజూరు చేయించుకున్నామని, ప్రెస్ క్లబ్ లో ప్రతిఒక్కరూ సభ్యులై భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలి

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నా పట్టించుకోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏఐవైఎఫ్ నాయకులు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. జులై నెలలో కొత్త బస్టాండ్ దగ్గర ఉన్న ఓ హాస్పిటల్ లో లింగ నిర్ధారణ పరీక్షల చేయడం మూలంగా ప్రాణాలు కోల్పోయిందని, దాదాపు 40 రోజులైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, నగర కార్యదర్శి బిసన్న ఆరోపించారు. కర్నూల్ నడిబొడ్డున ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఓ హాస్పిటల్ పేరుతో కొన్ని ఏళ్లుగా వైద్య పరీక్షలు సర్జరీలు చేస్తున్నారని, డీ ఎం అండ్ హెచ్ ఓ కు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. ఎన్ ఆర్ పేటలోనూ వైద్యుల నిర్లక్ష్యం మూలంగా ఓ మహిళ మృతి చెందిందని, ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపించి నిర్లక్ష్యం వహించిన డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మామిదాలపాడు గ్రామానికి చెందిన భవ్యకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద1,45000 రూపాయల చెక్కును అందజేసిన కోడుమూరు ఎమ్మెల్యే



మన గళం కర్నూలు: కోడుమూరు నియోజవర్గం కర్నూల్ మండలం మామిదాలపాడు గ్రామానికి చెందిన %u%. భవ్య అనారోగ్య కారణాలవల్ల హాస్పిటల్ లో చికిత్స చేసుకున్నారు.అనంతరం ఆర్థిక పరిస్థితులు బాగా లేనందున వారు సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి అప్లై చేసుకోగా ఈరోజు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని సంప్రదించగా వారు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద వారికి ఈరోజు 1,45000 రూపాయల చెక్కును కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అందజేశారు ఈ చెక్కును తీసుకున్న బాధితులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మరియు డి విష్ణువర్ధన్ రెడ్డి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కృతజ్ఞతలు తెలిపారు.

మంగళవారం
02 - 09 - 2025
మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

అనువాదకుడికి అందిన సత్కారం

కాళిదాసు శ్లోకాలను తెలుగులో స్వేచ్ఛా కవితానువాదం చేసిన డాక్టర్ రఘువర్మ విమర్శకులతో శభాష్ అనిపించుకున్నారు. ఆయన ప్రతిభను గుర్తించిన సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం అందిస్తున్నది. సాహిత్య రచనలో అనువాదం క్లిష్టమైన ప్రక్రియ. రెండు భాషలు తెలియడమే కాదు, ఆ భాషల్లోని సాహిత్యంపై కూడా అనువాదకుడికి తగిన పరిజ్ఞానం ఉండాలి. సాధారణంగా ఇతర భాషల సాహిత్యం ఇంగ్లీషు మాధ్యమంగానే మరో భాషలోకి ప్రవేశిస్తుంది. ఆంగ్ల భాషపై పట్టున్నవాళ్లు ఇతర భాషల్లో ప్రఖ్యాతిగాంచిన పుస్తకాలను తర్జుమా చేస్తుంటారు. సంస్కృత కావ్యాలను సరాసరి తెలుగులోకి తేవడానికి చాలా విషయాల్లో ప్రవేశం ఉండాలి. సంస్కృతంతో పాటు ఇరు భాషల కవిత్వంపై సాధికారిత ఉండాలి. తెలుగు కవిగా నిలబడినవారే ఆ ప్రయత్నంలో నెగ్గుకురాగలరు. తెలుగు విశ్వవిద్యాలయం ఏటా అనువాద సాహిత్యానికి ఇచ్చే రామవరపు శాంతాసుందరి స్మారక పురస్కారం-2023 సంవత్సరానికి గాను రఘువర్మ అందుకుంటున్నారు. తెలుగులో డాక్టరేట్ అందుకున్న డాక్టర్ తుమ్మనపల్లి లక్ష్మీనారాయణ కలం పేరు రఘువర్మ. ఆయన పలు కాలేజీల్లో అధ్యాపకుడిగా పనిచేశారు. సొంతూరు జగిత్యాలలో విశ్రాంత జీవితం గడుపుతున్న ఆయన 2021లో మహాకవి కాళిదాసు విరచిత మేఘసందేశం కావ్యాన్ని తెలుగులోకి అనువదించారు. వచన కావ్యానువాదరీతిలో కాళిదాసు శ్లోకాలను రఘువర్మ అనువదించిన తీరు ప్రశంసలకు పాత్రమైంది. మూలభావాలకు భంగం కలుగకుండా స్వేచ్ఛను అవలంబిస్తూ చక్కని శైలిలో పూర్తిచేశారని, అచ్చతెనుగు పదబంధాలు-సమాసాలతో రచనకు వన్నె తెచ్చారని పలువురు మెచ్చుకున్నారు. 2022లో కాళిదాసు మరో కావ్యమైన ఋతుసంహారఃను రఘువర్మ అనువదించారు. 2023లో రవీంద్రనాథ్ టాగోర్ 'గీతాంజలి'కి తెలుగులో తనదైన రీతిలో స్వేచ్ఛానువాదాన్ని తెచ్చారు. అదే సంవత్సరం భర్తృహరి 'నీతి శతకం'ను కూడా తెలుగులోకి అనువదించారు. కావ్య ప్రమాణాల్లో ఉత్కృష్ట గ్రంథాలను ఎంచుకొని ప్రతిభావంతంగా అనువదించిన రఘువర్మకు గుర్తింపుగా ఈ పురస్కారం లభిస్తున్నది. వీటికి తోడుగా ఆయన ఎన్నో ఆంగ్ల కవితలను తెలుగులోకి తెచ్చారు. తన సొంత కవిత్వంతో హృదయ జలధి, కవిత్వం వింతభాష, మూడోకంటి చూపు, మేఘ రాగరంజని అనే సంపుటాలను వెలువరించారు. కవి, అనువాదకుడైన రఘువర్మ మంచి చిత్రకారుడు, గాయకుడు కూడా. తన పుస్తకాలకు తానే ముఖచిత్రాలు వేసుకున్నారు. సినీ, లలిత సంగీత గీతాలాపనలో సిద్ధహస్తుడు. గాయకుడిగా ప్రశంసలు, పురస్కారాలందుకున్నారు. స్వయం కృషి, పట్టుదలతోనే ఇన్ని కళల్లో రాణించే స్థాయికి రఘువర్మ చేరుకున్నారు. ఇంటర్‌లోనే చదువు ఆపేసి సొంత బంగారు దుకాణంలో ఉండమని ఇంటి పెద్దలు ఒత్తిడి చేయగా వారికి తెలియకుండా ఆయన ప్రైవేటుగా డిగ్రీ పూర్తిచేశారు. వ్యాపారంపై మనసు నిలువని ఆయన 1981లో ఉస్మానియా యూనివర్సిటీలో చేరి తెలుగులో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్డీ దాకా చదివారు. ఆయన ఉద్యోగ జీవితం పార్ట్ టైం, కాంట్రాక్ట్ లెక్చరర్‌గా అస్థిరంగానే ముగిసింది. ఒంటరి బతుకుకు మరో దెబ్బగా 1996లో కుడి కన్ను చూపు కోల్పోవడం ఆయన జీవితంలోని విషాదమని చెప్పవచ్చు. ప్రతిభ గల సాహిత్యకారుడైన రఘువర్మ నేటి లౌక్యానికి, కపటానికి దూరంగా ఉంటారు. తనదైన ధోరణిలో తనకు పట్టు దొరికిన కళలతో సహవాసం చేస్తున్నారు. తన శ్రమకు బదులుగా గొప్పగా ఏమీ ఆశించని కవి రఘువర్మను సత్కరించడమంటే ఆ పురస్కారానికి యోగ్యు డు దొరికిండనే చెప్పాలి.

## ఏపీ రైతు సంఘం జెండావిష్కరణ



మనగళం, నందవరం : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నందవరంలో రైతు సంఘం డిమాండ్స్ డే సందర్భంగా నాయకులు జండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన గౌడ్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడచినా రైతులకు స్వేచ్ఛ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా 70 శాతం వ్యవసాయం మీద ఆధారపడిన రైతు కుటుంబాలు వ్యవసాయం చేసుకోలేక అప్పుల భారం మోయలేక ఆత్మహత్యల వైపు పోతున్నారన్నారు. రైతులు కావలసింది సకాలంలో పంట రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. అధిక వర్షాల వల్ల పంటలకు నష్టాలు జరుగుతున్నందున పంట రుణాలు మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, తాలూకా కార్యదర్శి శాంతప్ప, సీపీఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, నాయకులు ముని రామలింగడు, నాగన్న, రామాంజనేయ, దేవేంద్ర, నరసింహులు, తిమ్మప్ప, రఘురాముడు తదితరులు పాల్గొన్నారు.

## మెన్స్ వేర్ షాప్ ను ప్రారంభించిన కాటసాని





మనగళం, కల్లూరు : కల్లూరు అర్బన్ 41వ వార్డు పరిధిలోని ఉల్చల రోడ్ వై జక్షన్ నందు "మిస్టర్ ఫ్యాసిన్ మెన్స్ వేర్ షాప్ ను సోమవారం పాణ్యం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభించారు. దుస్తుల నాణ్యతను కాటసాని పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గిడ్డయ్య ను పరామర్శించిన కాటసాని



మనగళం, కల్లూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడి కల్లూరు శ్రీ చక్ర హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న వాముసముద్రం గ్రామానికి చెందిన చిన్న గిడ్డయ్య ను సోమవారం వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పరామర్శించారు. గిడ్డయ్య ప్రస్తుత పరిస్థితిని డాక్టర్ల ను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని కాటసాని సూచించారు.

## ఎంపీ బైరెడ్డి శబరిని సన్మానించి బేడ బుడగ జంగాలు



మనగళం, పగిడ్యాల : నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిని సోమవారం బేడ బుడగ జంగం సామాజిక వర్గం ప్రజలు ఘనంగా సన్మానించారు. పార్లమెంట్ లో బేడ బుడగ జంగం కులాన్ని ఎస్ సీ జాబితాలో చేర్చాలని గళమెత్తిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి అభినందనలు తెలుపుతూ పగిడ్యాల మండలం లక్ష్మాపురంలో గ్రామ సర్పంచ్ బేడ బుడగ జంగం సిరిగిరి సుజాత ఆధ్వర్యంలో ఆ కుటుంబాల సభ్యులు ఘనంగా సత్కరించారు. మా బేడ బుడగ జంగం కులం సమస్య గురించి ఢిల్లీలోని పార్లమెంట్ లో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడి మాకు మనో ధైర్యం కల్పించారని ఈ సందర్భంగా సుజాత సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామంలో శాశ్వత మంచినీటి పరిష్కారం ఓహెచ్ఆర్ ట్యాంక్, బోర్ మోటార్ కు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించాలని కోరుతూ ఎంపీ కి వినతి పత్రం అందజేశారు.

## పింఛన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే గౌరు



మనగళం, కల్లూరు : కల్లూరు అర్బన్ 28వ వార్డ్ లక్ష్మీపురం గ్రామంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ లను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి స్వయంగా నగదు అందజేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు,సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం తోనే అభివృద్ధి...



మన గళం అవుకు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలుగుదేశం పార్టీ నాయకుడు కైప చంద్రశేఖర్ రెడ్డి సోమవారం అన్నారు. అవుకు మండలంలోని సుంకేసుల గ్రామం లో సోమవారం పింఛన్ల పంపిణీ అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్రం వెనుకబడిపోయిందని తిరిగి అభివృద్ధి చెందాలంటే ఒక్క కూటమి ప్రభుత్వానికి సాధ్యమని అది గుర్తించిన ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టంకట్టడం జరిగిందన్నారు . ప్రజల నమ్మకాన్ని నిజం చేస్తూ ఇచ్చిన హామీలన్నీ ఒక్కొకటి కూటమి ప్రభుత్వం అమలు చేయడంలో దూసుకెళ్తున్నట్లు ఆయన అన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో పేరొందాలి

**– నిర్ణీత గడువులోగా అర్జీలకు పరిష్కారం చూపాలి – జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

మనగళం, డోన్ : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు పేరొందాలని, జిల్లాను మొదటి స్థానంలో ఉంచాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని డోన్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతయుతంగా వ్యవహరిస్తూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలన్నారు. అర్జీదారుల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ లో ఆళ్లగడ్డ, బండి ఆత్మకూరు, కొత్తపల్లి, పగిడ్యాల, ఉయ్యాలవాడ మండలాల్లో మిశ్రమ స్పందన వస్తుందని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కువగా భూ సమస్యలు వస్తున్నాయని, రెవెన్యూ అధికారులు భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రానున్న రోజుల్లో అర్జీలను ఆడిట్ చేసే సమయంలో అర్జీదారుని వాయిస్ కూడా వారి సమ్మతితో రికార్డు చేసి పంపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిదని, అధికారులు జాగ్రత్తగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో పరిశుభ్రత, పారిశుద్ధ్యం చర్యలు తీసుకోవాలని మున్సిపల్, నీటి వనరులు, మత్స్యశాఖ, ఆర్ అండ్ బి, అగ్నిమాపక శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం కౌశలం అనే యాప్ ద్వారా పదవ తరగతి నుండి పై చదువులు చదివిన యువత వివరాలను నమోదు చేయడం జరుగుతోందన్నారు. తద్వారా రాష్ట్రంలో సుమారుగా ఐదు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

**– పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన కొన్ని అర్జీలు**



పాపిలి మండలం, పిఆర్ గ్రామానికి చెందిన వడ్డే వెంకటరాముడు తనకు పీఎం కిసాన్ పథకం వర్తించలేదని జిల్లా కలెక్టర్ కు అర్జీ సమర్పించారు. తనకు రేషన్ కార్డు మంజూరు చేయాలని డోన్ మండలం డోన్ గ్రామానికి చెందిన పెద్ద సుబ్బయ్య అర్జీ సమర్పించారు. తాను డిగ్రీ వరకు చదువుకున్నానని, ఉపాధి కల్పించాలని పాపిలి మండలం, పాపిలి గ్రామానికి చెందిన ఎస్. వేదవతి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. స్పందించిన కలెక్టర్ విచారించి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## ఎస్సీ ఎస్టీ వార్డులకు సబ్ ప్లాన్ లినిధులు విడుదల చేయాలని సిపిఐ మున్సిపల్ కౌన్సిలర్

మన గళండోన్ పట్టణంలో మునిసిపాలిటీలో ఉన్న నాలుగు ఎస్సి వార్డులకు 16,17,15,3,వార్డులు అలాగే 28వ ఎస్టి వార్డుకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయాలని సోమవారం నాడు పీజీఆర్ఎస్ ప్రోగ్రాంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గారికి డోన్ సిపిఐ 16వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పి. సుంకయ్య వినతి పత్రం ఇవ్వడం జరిగింది స్పందించిన కలెక్టర్ గారు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల గురించి రాష్ట్రస్థాయి కమిషనర్ కు మీరిచ్చిన అర్జీ విషయమై పరిష్కారానికి వెంటనే పంపి ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయడానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది

ఈ సందర్భంగా సిపిఐ మున్సిపల్ కౌన్సిలర్ మాట్లాడుతూ 2019 నుండి 2025 వరకు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేయలేదని అనేకసార్లు మున్సిపల్ కౌన్సిల్లో ప్రస్తావించినా కూడా ప్రయోజనం లేదని ఇప్పటికైనా అణగారిన వెనుకబడ్డ ఎస్సీ ఎస్టీ వార్డులు అభివృద్ధి కోసం ప్రజల మౌలిక వసతుల కోసం ప్రధానంగా ప్రధాన వార్డులోని మసీదు వెనుక భాగం త్రివర్ణ కాలనీ హౌసన్న మందిర్ వీడియోస్ కాలనీ సర్వోత్తమ రెడ్డి కాలనీ బ్రాండ్స్ కాలనీ బ్రాండ్స్ కాలనీ డిగ్రీ కాలేజీ ప్రభుత్వ హాస్పిటల్ వరకు సిసి రోడ్లు కాలువలు వీధిలైట్ల ఏర్పాటు కోసం కరెంటు స్తంభాలు ఇవి పరిష్కారం కాలేదని పరిష్కారం కావాలనుకుంటే 14 ఫైనాన్స్ నిధులు కనీసం పిల్ల కాలువలు కూడా ఏర్పాటు చేయలేకపోయామని చట్టబద్ధంగా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఉన్నా సరే వాటిని విడుదల చేయడంలో గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది కనీసం ఇప్పటి ప్రభుత్వమైన ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు విడుదల చేసి వార్డుల అభివృద్ధి వార్డుల మౌలిక వసతుల కోసం ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వెంటనే విడుదల చేయాలని చెప్పేసి సిపిఐ 16వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పి సుంకయ్య ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .



– పి సుంకయ్య కలెక్టర్ కి వినతి.

## గోరుమానుకొండ బీసీ గురుకుల పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే కోట్ల





మన గళంబేతంచర్ల మండలం గోరుమానుకొండలో నిర్మితమైన బీసీ గురుకుల పాఠశాలను డోన్ శాసనసభ్యులు గౌరవనీయులు శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఈరోజు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీలింగ్ పైకప్పు సహా భవనంలో తలెత్తుతున్న నిర్మాణ లోపాలు, మరిన్ని సౌకర్య సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నాణ్యత ప్రమాణాలను పాటించకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, వెంటనే సరిదిద్దే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ధనం వృథా కాకుండా, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా నిర్మాణ లోపాలను వెంటనే సరిచేయాలి. సమస్యలు పరిష్కరించకపోతే కఠిన చర్యలు తప్పవు," అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల





మన గళండోన్ పట్టణంలోని 26వ వార్డు తారక రామ్ నగర్, మరియుదేవర బండ గ్రామం నందు ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమంలో భాగంగా గౌరవనీయులు డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేసి, ప్రజలతో మమేకమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పథకం వల్ల వృద్ధులు, వికలాంగులు, నిరుపేదలు ఆర్థికంగా కొంత ఊరట పొందుతున్నారని తెలిపారు. "ప్రతి పింఛన్ మీ భరోసా, ప్రతి రూపాయి మీ అండ," అని ఎమ్మెల్యే గారు ఉద్ఘాటించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఇంటికి చేరవేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, ప్రజల సమస్యలు తీర్చడంలో ఎప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, పాల్గొని కార్యక్రమానికి విజయవంతం చేశారు.

## ప్రజలను జాగృతం చేసే సాహిత్యం రావాలి



మనగళం, నెట్ వర్క్ : ప్రజలను చైతన్యవంతం చేసే సాహిత్యం అవసరమని కృష్ణా జిల్లా పూర్వ కలెక్టర్ ఎ.ఎండి. ఇంతియాజ్(రిటైర్డ్) పేర్కొన్నారు. ఆదివారం గవర్నర్ పేటలోని విజ యవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్లో ఎక్రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కవితల పోటీల విజేతలకు '2024 ఎక్స్ రే' అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యులకు అర్థమయ్యే భాషలో కవిత్వం ఉండాలని సూచించారు. వేమన, జాషువా, శ్రీశ్రీ కవిత్వం స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. డిప్యూటీ కలెక్టర్ కొమ్మెర్ల కృష్ణవేణి మాట్లాడుతూ మహిళలు కవిత్వంలోనూ ముందుండాలని పిలుపునిచ్చారు. సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, కార్యదర్శి జయరాజు పోటీల విశేషాలు వివరించారు. గత 44 ఏళ్లుగా ఈ కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 'కన్నీటి రణం' కవిత రచించిన మానుకోటకు చెందిన అక్షరం ప్రభాకర్ కు ప్రథమ బహుమతి కింద రూ.12వేల నగదు, జ్ఞాపిక అందించి సన్మానించారు. అలాగే మామిడి శెట్టి శ్రీనివా సరావు, శ్రీధర్ బాబు, చిత్రాడ కిషోర్ కుమార్, జగరాపు శంకరరావు, శ్రీకంఠస్ఫూర్తి, దుప్పటి రమేష్ బాబు, ధవళేశ్వరపు రవికుమార్, డాక్టర్ కె. హరనాథ్ లకు రూ. 1000 నగదు, జ్ఞాపిక, అవార్డులతో ఉత్తమ కవులుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య, కందికొండ రవికిరణ్, పొత్తూరి సీతారామారావు, బి. వసంత కుమార్, కొల్లూరి కనకవల్లి పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ

మనగళం, నంద్యాల : మంత్రివర్యులైన శ్రీ ఎన్ఎండి ఫరూక్ ఆదేశాల మేరకు సోమవారం 37 వార్డులో ఇన్చార్జ్ మామిడి ఉషారాణి, శ్రీ మామిడి నాగరాజు కుమార్ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ చేశారు. లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ షబ్బీర్ బాషా, కోడిగంటి లక్ష్మీనారాయణ, షేక్ అలీ ఉల్లా, దుర్గాప్రసాద్, అల్లా బకాష్ తదితరులు పాల్గొన్నారు.



## విజన్ ఉన్ననేత చంద్రబాబు నాయుడు

– మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్థాక్ అహ్మద్



మనగళం, నంద్యాల : సీఎం నారా చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నేత అని, నాలుగు సార్లు ముఖ్యమంత్రి గా సుపరిపాలన అందించిన... అందిస్తున్న నేత అని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్థాక్ అహ్మద్ పేర్కొన్నారు. తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి 30 ఏళ్లు అయిన సందర్భంగా సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మౌలానా ముస్థాక్ అహ్మద్ మాట్లాడారు. నారా చంద్రబాబు నాయుడు ప్రజల వద్దకే పాలనను తీసుకొని వచ్చిన దార్శనికుడని, పేదల కొరకు పూర్.. టూ..రిచ్.. అనే కాన్సెప్ట్ ని అమలులోకి తీసుకొని వచ్చారని గుర్తు చేశారు. పేదలను ధనికులుగా మార్చాలనే ఉద్దేశంలో పీ4 కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. అదేవిధంగా ముస్లీం ఇమాంలకు,మోజన్ల ను అదుకోవాలని వారికి గౌరవం వేతనం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. సాగు, తాగు నీరు అందించడమే లక్ష్యంగా చంద్రబాబు ముందుకు సాగుతున్నారన్నారు. హైదరాబాద్లో హైటెక్ సిటీ ని ఏర్పాటు చేసి ఈ రోజు ఐటీ హబ్ గా నలబెట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తూ రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు.

## వినాయకుడికి ప్రత్యేక పూజలు





మనగళం, కల్లూరు : గణపయ్య ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య సాగుతున్నాయి. సోమవారం కల్లూరు అర్బన్ 35 వ వార్డులోని "సిద్ధిబుద్ధి వరసిద్ధి వినాయకుడిని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినాయక భక్త బృందం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని కాటసాని ప్రారంభించారు. భక్తులకు స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో 32వ వార్డు కార్పొరేటర్ సాన శ్రీనివాసులు, మిద్దూరు శ్రీనివాసులు, జానకమ్మ, కాటసాని హెల్పింగ్ హాండ్స్ సభ్యులు ఆనంద్, లక్ష్మి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## జియోలో రూ.289 ప్లాన్.. బీఎస్ఎన్ఎల్ లో కేవలం రూ.151కే..

మనగళం, ప్రభుత్వ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) తమ వినియోగదారులకు చాలా చౌకైన ప్లాన్లు అందిస్తోంది. బడ్జెట్ ధరలో టెలికాం సేవలు అందిస్తోన్న సంస్థగా బీఎస్ఎన్ఎల్ పేరు సూచించవచ్చు.ప్రైవేట్ టెలికాం కంపెనీలైన ప్రత్యర్థి సంస్థలు జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు కొద్ది కాలం క్రితం రీఛార్జ్ ప్లాన్ల ధరలు పెంచితే బీఎస్ఎన్ఎల్ మాత్రం చౌక ప్లాన్ అందిస్తూ యూజర్లను ఆకర్షిస్తోంది. 4జీ సేవలను అందుబాటులోకి తెస్తూ చౌక ప్లాన్లు ఇస్తుండడంతో చాలా మంది బీఎస్ఎన్ఎల్‌కు మారిపోతున్నారు. అయితే 5జీ యూజర్ల విషయానికి వస్తే జియో, ఎయిర్ టెల్‌కే జై కొడుతుండడం గమనార్హం. ప్రస్తుత రోజుల్లో ఇంటర్నెట్ వినియోగం భారీగా పెరిగింది. సోషల్ మీడియాలో క్షణ కాలం లేకపోతే ఏదో జరిగిపోతుందనే స్థాయికి వచ్చేశాం. దీంతో ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ప్లాన్లకే మొబైల్ యూజర్లు మొగ్గు చూపుతున్నారు. రోజు వారీ డేటా అయిపోతే ఇబ్బందులు పడకుండా అదనపు డేటా ప్లాన్లతో రీఛార్జ్ చేసుకుంటారు. ఈ డేటా ప్లాన్లలోనూ బీఎస్ఎన్ఎల్ చౌక అని చెప్పవచ్చు. జియోలో ప్రస్తుతం రూ. 289 డేటా ప్లాన్ బీఎస్ఎన్ఎల్‌లో కేవలం రూ. 151కే లభిస్తోంది. అంటే దాదాపు 50 శాతం డిస్కౌంట్ రేటుతో అవే బెనిఫిట్స్ కల్పిస్తోంది. బీఎస్ఎన్ఎల్ డబ్ల్యూఎఫ్‌హెచ్ ఎస్‌టీవీ రూ. 151 ప్లాన్ అనేది ఒక డేటా ఓన్లీ ప్లాన్. ఈ ప్లాన్ కొనుగోలు చేస్తే 40 జీబీ హైస్పీడ్ డేటా లభిస్తుంది. 28 రోజుల పాటు వ్యాలిడిటీ ఉంటుంది

## గూడూరులో పింఛన్ పంపిణీ



మనగళం, గూడూరు : కర్నూలు జిల్లా గూడురులో టీడీపీ నేత మదాసి ఎల్లప్ప సోమవారం పింఛన్ పంపిణీ చేశారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ నగదును లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ప్రభుత్వ తీరుపై లబ్ధిదారులతో ఆయన మాట్లాడగా వారు సంతోషం వ్యక్తం చేశారు. తమను పెద్ద కుమారుడిలా చంద్రబాబు ఆదుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు.

మంగళవారం
02 - 09 - 2025
మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# మోడీ గారి తల్లి హీరాబెన్ గారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీని కఠినంగా శిక్షించాలి






మన గళండోన్ బీహార్ రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ గారు మరియు కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఓటర్ వికాస్ యాత్రను ప్రారంభించారు. యాత్ర జరుగుతున్న సమయంలో, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారిని మరియు వారి మాతృ మూర్తి స్వర్గీయ శ్రీమతి హీరాబిన్ మోడీ గారిని దూషిస్తూ అనుచిత, అవమానకరమైన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాక్యాలు నిరసిస్తూ సోమవారం నాడు బిజెపి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ మీద వెంటనే చర్యలు తీసుకోవాలని డోన్ పాతబస్టాండ్ వద్ద నిరసన తెలుపుతూ రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దహనం చేస్తూ నిరసన తెలిపిన డోన్ బీజేపీ నాయకులు ఈ కార్యక్రమంలో బిజెపికిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి, విశ్వకర్మ ఇంప్లిమెంటేషన్ మెంబెర్ ఆర్మీ రామయ్య, మాజీ జిల్లా కార్యదర్శి రామచంద్ర నాయుడు, ఓబీసీ జిల్లా నాయకులు ఆవుకు వెంకటేశ్వర్లు, యువనాయకులు రాజ్ పురోహిత్ కమలేష్, %ఎఖ% హరినాయుడు, ఉమ్మాజి రావ్, ముదిరాజ్ లక్ష్మి నారాయణ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంగళవారం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు

మన గళండోన్ జనసేన పార్టీ అధ్యక్షులు ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ గారి జన్మదిన సందర్భంగా 2.9.2025 మంగళవారం రోజున గౌరవనీయులు మన ప్రియతమ నేత మాజీ రైల్వే శాఖ మంత్రివర్యులు అయినటువంటి డోన్ %మీణా% కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి గారు ఆయన చేతుల మీదుగా 10:00 గంటలకు దొరపల్లి గ్రామం లో జనసేన జెండా ఆవిష్కరణ చేస్తారు. అనంతరం దొరపల్లె గ్రామం నుండి బైక్ ర్యాలీ తో రాయల్ సర్కిల్, మరియు ఇంద్రనగర్, తారకరాంనగర్ కూడలిలో 10:30 గంటలకు జెండా ఆవిష్కరణ చేస్తారు. తదుపరి సాయి ఫంక్షన్ హాల్ లో కేక్ కటింగ్ మరియు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది కావున పాత్రికేయులు %డ% ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు సోదరులు తప్పక ఈ కార్యక్రమాలకు రావాలని మనసారా కోరుకుంటున్నాను. ఇట్లు మీ అల్లా మోహన్ రెడ్డి





## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి





మన గళం సి.బెళగల్: కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సి.బెళగల్ మండలం బ్రాహ్మణ దొడ్డి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆ గ్రామంలో ప్రతి ఇంటికి వెళుతూ అవ్వ తాతలకు,వికలాంగులకు, లబ్ధిదారులకు పెన్షన్ పంచుతూ వారి కళ్ళల్లో ఆనందం చూశారు.ఇలా ప్రతినెల పెన్షన్ పంపిణీ ఒక పండుగ వాతావరణంలో చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పెన్షన్ లబ్ధిదారులు ధన్యవాదాలు తెలియజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొగ్గులు దస్తగిరి మాట్లాడుతూ ప్రభుత్వం వికలాంగుల పెన్షన్లు తీసివేస్తున్నారు అని అసత్య ప్రచారాలు ఎవరు నమ్మవద్దు అర్హులందరికీ కచ్చితంగా పెన్షన్ అందుతుందని ఎవరు అధైర్య పడవద్దు అని పేర్కొన్నారు.అలాగే కూటమి ప్రభుత్వం చెప్పిన హామీలన్నీ సిఎం నారా చంద్రబాబు నాయుడు నెరవేరుస్తున్నారని తల్లికి వందనం,ఉచిత బస్సు ప్రయాణం,అన్నదాత సుఖీభవ,ఉచిత గ్యాస్ లు,పెన్షన్ పెంపు, మెగాద్వారా ఉద్యోగాలు, ఇంక ఎన్నో సంక్షేమ అభివృద్ధి మొదలగు కార్యక్రమాలు చేస్తున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాయకులు సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, మరియు అధికారులు,సచివాలయం సిబ్బంది,గ్రామ కూటమి నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# కొత్త బంకులకు జియో-బీపీ నోటిఫికేషన్




మన గళం కొన్ని వ్యాపారాలు నిర్వహిస్తే నిత్య కల్యాణం పచ్చ తోరణంలా సాగుతాయి సంవత్సరం పొడవునా గిరాకీ ఉంటుంది. అలాంటి వ్యాపారాల్లో పెట్రోల్ పంప్ ఒకటని చెప్పవచ్చు.మంచి లొకేషన్‌లో పెట్రోల్ పంప్ ఏర్పాటు చేసినట్లయితే 24 గంటలు గిరాకీ ఉంటుంది. మంచి లాభాలు అందుకోవచ్చు. దీంతో చాలా మంది పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలని అనుకుంటారు. కానీ, ప్రాసెస్ తెలియగా వెనకడుగు వేస్తుంటారు. ఈ బిజినెస్‌లో ఒకసారి పెట్టుబడి పెట్టినట్లయితే ఆ తర్వాత ప్రతి ఏటా ఆదాయం వస్తూనే ఉంటుంది. అయితే ఒకేసారి పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయాల్సి వస్తుంది. కొంత అనుభవం సైతం ఉండాలి. అన్ని అర్హతలు ఉంటే పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం చాలా సులభమే అని చెప్పవచ్చు. మీరు సైతం పెట్రోల్ బంక్ పెట్టాలని అనుకుంటుంటే మీకో బెస్ట్ డీల్ అందుబాటులో ఉంది. ప్రముఖ ప్రైవేట్ చమురు రిటైలింగ్ కంపెనీ రిలయన్స్ జియో- బీపీ సంస్థ కొత్త బంకులు ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పిస్తోంది. మున్సిపల్ పరిధి, సహా గ్రామీ ప్రాంతాల్లోనూ ఈ బంకులు ఏర్పాటు చేసే అవకాశం ఇస్తోంది. జియో- బీపీ పెట్రోల్ బంకు ఏర్పాటు చేయాలనుకునే వారు అక్టోబర్ 31, 2025 వరకు దరఖాస్తులు సమర్పించే అవకాశాన్ని ఇచ్చింది. ఈ మేరకు సోషల్ మీడియా ఖాతాల్లో అవగాహన కల్పిస్తోంది. పూర్తి వివరాలకు జియో బీపీ అధికారిక వెబ్‌సైట్ జీఱశీఎజూ.ఱఅలోకి వెళ్లి తెలుసుకోవడంతో పాటు జూఖతీఅవతీం.యఱశీఎజూ.ఱఅ పేజీ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.జియో బీపీ మొబిలిటీ స్టేషన్ డీలర్‌షిప్ కోసం ప్రత్యేక బ్రోచర్ విడుదల చేసింది జియో బీపీ సంస్థ. నేషనల్, స్టేట్ హైవేల పక్కన లేదా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే దారుల పక్కన భూమి కలిగి ఉండి పెట్టుబడి పెట్టే సామర్థ్యం ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. డీలర్ ఓన్డ్ డీలర్ ఆపరేటెడ్ ప్రాతిపదికన ఈ రిటైల్ ఔట్‌లెట్లు ఏర్పాటు చేస్తోంది. దరఖాస్తు చేసుకునే సంస్థ యాజమాన్య సంస్థ అయితే యజమాని ఫారమ్ నింపాల్సి ఉంటుంది. భాగస్వామ్య సంస్థ అయితే ప్రతి భాగస్వామి ప్రత్యేక ఫారమ్ నింపాలి. ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అయితే, ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ఎంటిటీగా నింపాల్సిన ఫారమ్. పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ అయితే, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ అనే సంస్థతో నింపాల్సిన ఫారమ్. అలాగే సీఏ ద్వారా తాజా నెట్‌వర్త్ స్టేట్మెంట్ లెటర్ తీసుకురావాలి. కేవైసీ డాక్యుమెంట్లు పాన్, ఆధార్ కార్డు, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ ఉండాలి. అఫిడవిట్ ఉండాలి. ల్యాండ్ డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుంది. అయితే ఇతర ఆయిల్ మార్కెటింగ్ కంపెనీతో సంబంధాలు ఉన్న వారు, దివ్యాగులు, ఏదైనా కేసులో నేరం రుజువైన వారు, ఎన్ఆర్ఐలకు అర్హత ఉండదు. నాన్-రిఫండబుల్ అమౌంట్ రూ.5000 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని వెబ్‌సైట్లో జియో-బీపీ సంస్థ పేర్కొంది.

## కోడుమూరు మండలంలో పింఛన్లు పంపిణీ చేసిన టిడిపి నాయకులు



మన గళం కోడుమూరు: రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం చంద్రబాబు నాయుడు వృద్ధులు, వికలాంగుల, వితంతువుల జీవితాలలో వెలుగులు నింపారని కోడుమూరు మండల కన్వీనర్ లక్కిరెడ్డి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం కోడుమూరు నియోజకవర్గంలో ని వెంకటగిరి, వర్కూరు గ్రామాలలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం సదుద్దేశంతో పింఛన్లను పంపిణీ చేస్తుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అందిస్తానని చెప్పి పదవి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అన్ని హామీలను నెరవేరుస్తూ వచ్చారని తెలిపారు అన్ని గ్రామాల్లో టిడిపి నాయకులు పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు కిష్టాపురం గ్రామంలో కోడుమూరు మార్కెట్ డైరెక్టర్ శంకర్ రెడ్డి, లద్దగిరి గ్రామంలో పట్టే మధు, గుడిసె జయరాముడు, కొండాపురం ఓబులేసు, మధు, ప్రేమ్ కుమార్, 244 బూత్ లో భాస్కర్, చింతమాను స్వామి, చిల్లబండ గ్రామంలో చిల్లబండ భాష, ఒకటో వార్డులో మాల మునిస్వామి, కోడుమూరు మండలం కృష్ణాపురం గ్రామంలో సాగునీటి వినియోగదారుల సంఘం ప్రెసిడెంట్ పురుషోత్తం రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు కురువ నాగేంద్ర పాల్గొన్నారు.

# ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలి సిపిఐ డిమాండ్






మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో స్థానిక సిపిఐ నాయకులు ఆధ్వర్యంలో ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలని కోడుమూరు మండలంలోని సిపిఐ నాయకులు కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్ నందు నిరసన వ్యక్తం చేశారు. ఉల్లి పంటకు మద్దతు ధర కల్పించి పంటను కొనుగోలు సత్వర చర్య చేపట్టాలని ఈ సందర్భంగా సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎకరాకు 70 నుంచి 20వేల వరకు ఖర్చుపెట్టి ఉల్లిపాయ సాగు చేస్తే గిట్టుబాటు ధర లేక రైతు నష్టపోవాల్సిన పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు ఉల్లి ధరలు ఒకసారిగా భారీగా తగ్గిపోయాయని కనీసం రవాణా ఖర్చులు కూడా రాకపోవడంతో రైతులు కష్టాల కుబీలో చిక్కుకుంటున్నారని వారు ఈ సందర్భంగా తెలియజేశారు తెలుగు రాష్ట్రాల్లో కర్నూలు జిల్లా రైతులు అత్యధికంగా పండిస్తారని సీజన్ అయినప్పటికీ ఉల్లి ధరలు పెరగాల్సింది పోయి రోజురోజుకు ఉల్లి ధరలు తగ్గుతున్నాయని తెలిపారు రైతులకు తగిన న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మరియు రైతులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఐఓసీ రూ.1.66 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రణాళిక

మన గళం దేశంలోనే అతిపెద్ద చమురు కంపెనీల్లో ఒక్కటైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) భారీ పెట్టుబడులకు సిద్ధమయ్యింది. వచ్చే ఐదేండ్లలో రూ.1.66 లక్షల పెట్టుబడి వ్యయాలను చేయనున్నామని ఆ కంపెనీ ఛైర్మన్ అరవిందర్ సింగ్ సాహ్నీ వెల్లడించారు. ఈ పెట్టుబడులను చమురు శుద్ధి, ఇంధన విక్రయం, రసాయన ఉత్పత్తులు, సహజ వాయువు, పునర్వినియోగ శక్తి రంగాలలో విస్తరణకు ఉపయోగించనున్నామన్నారు. తమ ప్రస్తుత 80.75 మిలియన్ టన్నుల ఆయిల్ శుద్ధీకరణను 2028 నాటికి 98.4 మిలియన్ టన్నులకు పెంచాలని యోచించామన్నారు. పానిపట్, గుజరాత్, బరౌనీలలో ప్రధాన విస్తరణలు జరుగుతాయనా్రను. దేశంలోని 22,000 కిలోమీటర్ల పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను 21 ప్రాజెక్టులతో విస్తరిస్తోందన్నారు. ఇందులో నేపాల్‌లో కొత్త స్టోరేజీ సౌకర్యాలు కూడా ఉన్నాయని వెల్లడించారు. రసాయన ఉత్పత్తులను తదుపరి వృద్ధి ఇంజిన్‌గా లక్ష్యంగా చేసుకుని, ప్రస్తుత 4.3 మిలియన్ టన్నుల సామర్థ్యాన్ని 2030 నాటికి 13 మిలియన్ టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, లాభాలను పెంచేందుకు ప్రత్యేక రసాయనాలపై దృష్టి సారిస్తున్నామన్నారు.

# అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ టీడీపీ ప్రభుత్వం

- దేశంలోనే టాఫ్ 3 లో సీఎం చంద్రబాబు
- ఎన్ టీ ఆర్ భరోసా పెన్షన్లు, మినరల్ వాటర్ ఫ్లాంట్లు ప్రారంభించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



మనగళం, నందికొట్కూరు: అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేరాఫ్ అడ్రస్ సీఎం చంద్రబాబు నాయకత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. దేశంలోనే టాఫ్ 3 లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిలిచారని, ఆనాడు హైదరాబాద్ ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతో నేటికీ అక్కడి ప్రజలు బాబు గురించే మాట్లాడు కుంటున్నారని గుర్తు చేశారు. సోమవారం నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం తూర్పు, పరమట ప్రాతకోట గ్రామాల్లో, మిడ్తూరు మండలం కడుమూరు గ్రామాల్లో ఎంపీ నిధులతో నిర్మించిన ఉచిత మినరల్ వాటర్ ఫ్లాంట్లు ప్రారంభించారు. అదేవిధంగా లబ్ధిదారులకు ఎన్ టీ ఆర్ భరోసా పింఛన్ నగదును ఎంపీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లిన ఇప్పటికి ప్రజలు సిమెంట్ రోడ్లు, తాగునీటి కుళాయిలు తదితర మౌలిక వసతులు ఉన్నాయంటే అప్పటి ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి తెలుగుదేశం ప్రభుత్వంలోనే అని చెప్పడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని నియోజకవర్గం ప్రజలే చెబుతున్నారన్నారు. మహిళా పక్షపతిగా సీఎం చంద్రబాబు ఇంట్లో చదువుకుంటున్న విద్యార్థులందరికి తల్లికివందనం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా, ఆర్ టీ సి లో స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణం, ఒంటరి మహిళా, వృద్ధులు, వితంతు, దివ్యాంగులు తదితర అర్హులైన వారందరికీ ఎన్ టీ ఆర్ భరోసా పెన్షన్ అందిస్తూ ఆ కుటుంబాలకు సీఎం చంద్రబాబు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని గుర్తు చేశారు. మరో 30 ఏళ్లు రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం కొనసాగేలా ప్రజలు దీవించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహాక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, పగిడ్యాల ఎమ్మార్వో శివరాముడు, ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఆర్ డబ్ల్యూ ఎస్ ఏ ఈ శివకుమార్, మిడ్తూరు ఎమ్మార్వో శ్రీనివాసులు, ఎంపీడీఓ రామయ్య, ఆర్ డబ్ల్యూ ఎస్ డీ ఈ ఇగ్బాల్, ఈ ఓ ఆర్ డీ సంజన్న, కడుమూరు సర్పంచ్ రత్నమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు రామసుబ్బారెడ్డి, భగీరథ రెడ్డి, సీతారామిరెడ్డి, స్వామిరెడ్డి, రైల్వే జోనల్ వినియోగదారుల సలహా కమిటీ మెంబర్ నాగేశ్వరావు, బి ఎస్ ఎన్ ఎల్ సలహా కమిటీ మెంబర్ కురువ రమేష్, కె. శ్రీనివాసనాయకుడు, రామానాయకుడు, పైడిపాలెం నాగేశ్వరావు, నాగశేషులు, దశరథ రామిరెడ్డి, అల్లి ఉసెన్ తదితరులు పాల్గొన్నారు.



# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం



- బీజేపీ కార్యాలయం నుండి కర్నూలు కలెక్టర్ వరకు నిరసన ర్యాలీ

మనగళం, కర్నూలు సిటీ : ప్రధాని నరేంద్రమోడీ మాతృమూర్తి పై అనుచిత వాక్యలు చేసిన రాహుల్ గాంధీ తీరును ఖండిస్తూ బీజేపీ శ్రేణులు సోమవారం నిరసన తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణ సూచన మేరకు పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మతో నిరసన ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు రామస్వామి, వేల్పులగోపాల్, మద్దిలేటిరెడ్డి, మాలతీ గీతామాధురి, అనితరెడ్డి, సీతక్క, మురళీకృష్ణ, నాగేశ్వరరావు, హవిలేన్ బాబు, మద్దిలేటి, ఉమామహేశ్వరప్ప, నాగేంద్ర, గోరంట్ల, వెంకటేశ్వర్లు రాహుల్ గాంధీ తీరుపై మండిపడ్డారు. ప్రపంచంలోనే దేశాన్ని అగ్రగామిగా నిలిపినటువంటి ప్రధానమంత్రి నరేంద్రమోడీ మాతృమూర్తిని అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. రాహుల్ గాంధీ కల్లు తాగిన కోతి కంటే ఎక్కువగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. రాహుల్ ఇలాగే వ్యవహరిస్తే ఫలితం చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

# అర్హులైన ఏ ఒక్కరి పింఛన్లు రద్దుకావు

- వైసీపీ నాయకుల దుష్ప్రచారాన్ని నమ్మొద్దు - ఎంపీ బస్తిపాటి నాగరాజు



మనగళం, దేవనకొండ : అర్హులైన ఏ ఒక్కరి పింఛన్లు రద్దు కావని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు భరోసా ఇచ్చారు. వైసీపీ నేతల కుట్రతో దుష్ప్రచారం చేస్తున్నారని, వారి మాటలు నమ్మొద్దని సూచించారు. కర్నూలు జిల్లా దేవనకొండలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ డబ్బులను ఎంపీ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సొంత నియోజకవర్గం లో జరిగిన జెడ్పీటీసీ ఎన్నికలో ఓటమి చెందడం జీర్ణించుకోలేక మాజీ సీఎం జగన్ పింఛన్లపై దుష్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పింఛన్లు తొలగించారంటూ ప్రతిపక్ష పార్టీ నాయకులు చేస్తున్న ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి కూటమి ప్రభుత్వం పింఛన్లు అందిస్తుదన్న ఆయన వైసీపీ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని సూచించారు. అనంతరం పార్టీ మండల కార్యాలయంలో నాయకులతో సమావేశమయ్యారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల పై చర్చించి, దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు, నాయకులు ఉచ్చిరప్ప,ఆకుల వీరేశ్,బడిగింజల రంగన్న, మలకన్న,కప్పట్రాళ్ల మల్లికార్జున, సర్పంచులు, ఎంపీటీసీలు , జనసేన, బీజేపీ నాయకులు, ఎంపీడీఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబరు చివర్లో టాటా కేపిటల్ ఐపీఓ

మన గళం : బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) టాటా కేపిటల్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ఈ నెలాఖర్లో ఉండనుంది. సెప్టెంబరు 22తో ప్రారంభమయ్యే వారంలో పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు కంపెనీ సిద్ధమవుతోంది. ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ ద్వారా టాటా కేపిటల్ 2 బిలియన్ డాలర్లను (సుమారు రూ.17,200 కోట్లు) సమీకరించాలని అనుకుంటోంది. పబ్లిక్ ఇష్యూ అనంతరం కంపెనీ షేర్లు సెప్టెంబరు 30 కల్లా ఎక్స్ఛేంజీల్లో నమోదుకావచ్చు. ఇష్యూలో భాగంగా మొత్తంగా 47.58 కోట్ల షేర్లను విక్రయించనుండగా.. ఇందులో తాజా షేర్ల విభాగంలో 21 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా 47.58 కోట్లను కంపెనీ జారీ చేయనుంది. ఓఎఫ్ఎస్ విభాగంలో టాటా సన్స్ 23 కోట్ల షేర్లను, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) 3.58 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను మూలధన స్థాయిని బలోపేతం చేసేందుకు, భవిష్యత్ మూలధన అవసరాల కోసం వినియోగించనుంది. ఈ పబ్లిక్ ఇష్యూ విజయవంతంగా పూర్తయితే.. దేశీయ ఆర్థిక సేవల రంగంలో అతిపెద్ద ఐపీఓగా నిలుస్తుంది. అంతేకాకుండా టాటా గ్రూపు నుంచి ఇటీవలి కొన్నేళ్లలో పబ్లిక్ ఇష్యూకు వచ్చిన రెండో సంస్థ అవుతుంది. 2023 నవంబరులో టాటా టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూకు వచ్చిన సంగతి తెలిసిందే. తొలి పబ్లిక్ ఆఫర్‌కు వచ్చేందుకు సెబీకి ముసాయిదా పత్రాలను సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్ సమర్పించింది.

# జీఎస్‌టీ రేట్లపై స్పష్టత వస్తే అమ్మకాలు పుంజుకుంటాయ్

మన గళం కొత్త జీఎస్‌టీ రేట్లపై సాధ్యమైనంత త్వరగా స్పష్టత వస్తే మొత్తం వాహన పరిశ్రమకు లబ్ధి చేకూరుతుందని, ప్రస్తుత త్రైమాసికంలోనే విలాస కార్లతో విభాగంతో పాటు మొత్తం విక్రయాలు పుంజుకుంటాయని దిగ్గజ సంస్థలు అంచనా వేస్తున్నాయి. సాధారణంగా పండగల సీజన్‌లో విలాస కార్ల విక్రయాలు ఎక్కువగా ఉంటాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో సెప్టెంబరు 3-4 తేదీల్లో జీఎస్‌టీ మండలి భేటీ కానుంది. ఈ సమావేశంలో జీఎస్‌టీ రేట్ల మార్పులపై నిర్ణయం తీసుకోనున్నారు. ఇటీవల జీఎస్‌టీ రేట్లలో మార్పులు చేయనున్నట్లు వచ్చిన మార్పులతో కొనుగోలుదారులు అనిశ్చితిలో పడ్డారని బీఎండబ్ల్యూ ఇండియా గ్రూప్ అధ్యక్షుడు, సీఈఓ హర్దీప్ సింగ్ బరార్ పేర్కొన్నారు. కొనుగోలుదార్ల ఆసక్తి, గిరాకీ బలంగా ఉన్నాయని.. అయితే పన్ను రేట్లలో మార్పులు చేయొచ్చన్న అంచనాలతో వేచి చూసే ధోరణి పాటిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల కొత్త వాహన విక్రయాలపై ప్రభావం పడుతోందన్నారు. అన్ని ప్రయాణికుల విద్యుత్ కార్లను ప్రస్తుత 5 శాతం జీఎస్‌టీ శ్లాబ్‌లోనే ఉంచడం ద్వారా వాటి విక్రయాలను ప్రోత్సాహిస్తున్నట్లు అవుతుందని వెల్లడించారు. జీఎస్‌టీ రేట్ల నుంచి ప్రతికూల ప్రభావం ద్వారా విద్యుత్ కార్ల విక్రయాలు, దేశీయ ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతింటాయన్నారు. సెప్టెంబరు మొదటి వారంలో జీఎస్‌టీపై స్పష్టత రావొచ్చని, తద్వారా వినియోగదారుల విశ్వాసం పెరిగి, గిరాకీ అధికం కావొచ్చని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ అంచనా వేశారు. పండగల సీజన్‌పై కొనుగోలుదార్లలో భారీ అంచనాలు ఉన్నాయని, వచ్చే వారం నుంచి కంపెనీ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను ప్రారంభించనుందని మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ పేర్కొన్నారు. జీఎస్‌టీ రేట్లను తగ్గించే దిశగా ప్రభుత్వం సంస్కరణలు చేపట్టనుండటంతో.. కొందరు కొనుగోలుదార్లు తమ కొనుగోలు నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటున్నారని విశ్లేషకులు చెబుతారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు కొనుగోలు చేయాలనుకునే వారిలో ఈ ధోరణి కనిపిస్తోందని అంటున్నారు. అయితే ఈ కొనుగోళ్ల వాయిదా తాత్కాలికమేనని, జీఎస్‌టీ రేట్లపై స్పష్టత వస్తే అమ్మకాలు పుంజుకుంటాయని విశ్లేషిస్తున్నారు. ఇందుకు పండగ సీజను కూడా కలిసి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం



- పరిశ్రమలు,వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్

మనగళం, కర్నూలు సిటీ : రైతులకు ఎల్లప్పుడూ అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం మంత్రి టి.జి.భరత్ కర్నూలు మార్కెట్ యార్డ్ లో ఉల్లి రైతులు తీసుకొచ్చిన దిగుబడులను పరిశీలించి వారితో మాట్లాడారు. ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామస్తులు ఆంజనేయులు, ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట గ్రామస్తులు చిన్న నరసన్న, గోనెగండ్ల మండలం ఆల్వాల్ గ్రామస్తులు రామాంజనేయులు మొదలగు రైతుల ఉల్లిని మంత్రి పరిశీలించారు. దిగుబడులు ఏ విధంగా వచ్చాయి... ఎంత ఖర్చు అయ్యింది... తదితర వివరాలను రైతులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు అధిక వర్షాల వల్ల పంట నష్టం జరిగిందని, దిగుబడి తగ్గిపోయినదని మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి టి.జి. భరత్ మాట్లాడుతూ... గత మూడు రోజులుగా రైతులు తమ ఉల్లి పంటను కర్నూలు మార్కెట్ యార్డుకు తీసుకురావడం, వారు పడుతున్న ఇబ్బందులను గమనించామన్నారు. రైతుల సమస్యలపై అధికారులతో మాట్లాడానని, అదేవిధంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. మా కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని క్వింటాలుకు రూ. 1200 చొప్పున మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఆదేశించారన్నారు. ఈరోజు నుండి కొనుగోలు ప్రారంభించినట్లు మంత్రి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు ఇబ్బంది పడకూడదని, నష్ట పోకూడదు అన్న ఉద్దేశంతో ప్రభుత్వం స్వతహాగా ముందుకు వచ్చి కేజీ 12 రూపాయలు చొప్పున కొనడానికి నిశ్చయించి ఈ రోజు నుండి కొనుగోలు ప్రారంభించిందని రైతులకు తెలియజేశారు. ఇటువంటి మంచి పనులు చేయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారని, ఇది కేవలం ఆయనకే సాధ్యం అని మంత్రి టి.జి. భరత్ రైతులకు తెలియజేశారు. రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోటానికి అధికారులతో సహకరించాలని, మెత్తబడిన ఉల్లిని వేరు చేయాలని కోరారు. రైతులు తమ ఆధార్ కార్డును, బ్యాంక్ అకౌంట్ నంబరు, ఈపాస్ రిసిప్ట్ మొదలగునవి అధికారులకు ఇచ్చినట్లు అయితే ఒక వారం లోపల మీ ఉల్లి డబ్బులు మీ బ్యాంక్ అకౌంట్ లో జమ చేయబడుతాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కడప జేడీ మార్కెటింగ్ రామాంజనేయులు, డిప్యూటీ డైరెక్టర్ లావణ్య,కర్నూలు మార్కెటింగ్ ఏడీ నారాయణమూర్తి, మార్కెట్ యార్డ్ సెక్రటరీ జయలక్ష్మి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోల్కొండ హజ్మత్ బీ, వైస్ చైర్మన్ శేషగిరి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు మరియు కార్పొరేటర్ పరమేష్ పాల్గొన్నారు.



Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310